# హైదరాబాద్ పల్స్
జాతీయ తెలుగు దినపత్రిక

దేశం ముఖ్యం.... దేశ ప్రజల భద్రత ముఖ్యం.... మతం కాదు...

సీఈఓ : కె నవీన్ కుమార్ | ఎడిటర్: డా. రాహుల్ కుమార్ | సంపుటి: 03 | సంచిక : 85 | పేజీలు : 08 | బుధవారం | 01-04-2026 | వెల :4/-

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD, SANGAREDDY, WARANGAL, MANCHIRYAL, VIJAYWADA, GUNTUR, KURNOOL, TIRUPATI, KADAPA, BENGALURU, MUMBAI, CHENNAI, DELHI.



విలేకరులు కావలెను

హైదరాబాద్ పల్స్ జాతీయ తెలుగు దినపత్రిక

"ఎంతకైనా తెగిస్తాం... ప్రజల గొంతుకై నిలుస్తాం" అనే నినాదంతో రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రారంభించిన హైదరాబాడ్ పల్స్ జాతీయ దినపత్రికకు తెలుగు రాష్ట్రాలలోని అన్ని మండల, నియోజకవర్గాల, జిల్లాల వ్యాప్తంగా విలేకరులు కావలెను. * సీనియర్లకు ప్రాధాన్యత కలదు.

సంప్రదించవలసిన ఫోన్ నెంబర్స్

- Dr. RAHUL KUMAR 9989834020

- K. Naveen Kumar 94406 53413

www.hyderabadpulse.com HyderabadPulse @hyderabad




## 'పహిల్వాన్' భాష మాట్లాడుతున్నారు

2

### హరీశ్ రావు ఆగ్రహం

- అసెంబ్లీలో పాలసీలు ఉంటాయి కానీ కుస్తీ ద పోటీలు ఉండవని వ్యాఖ్య
- అసెంబ్లీని ఇష్టం వచ్చినట్లు నడుపుతున్నారని ఆరోపణ
- కాళేశ్వరం ప్రాజెక్టుపై రేవంత్ రెడ్డి, సీఆర్ పాటిల్ వ్యాఖ్యలకు తేడా లేదని విమర్శ

హైదరాబాద్ పల్స్,హైదరాబాద్

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలసీలను గాలికి వదిలేసి, పహిల్వాన్ల భాషను మాట్లాడుతున్నారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావు ధ్వజమెత్తారు. అసెంబ్లీలో పాలసీలు ఉంటాయి కానీ పహిల్వాలు, కుస్తీ

# ఇందిరమ్మ లబ్ధిదారులకు గుడ్‌న్యూస్

- ఆ తుది దశ పనులు చేయకున్నా ఆఖరి బిల్లుల మంజూరు
- ఇందిరమ్మ లబ్ధిదారులకు శుభవార్త
- ఇంటి తుది దశ పనులు చేయలేకపోతున్న వారికి వెసులుబాటు కల్పిస్తూ ఉత్తర్వులు జారీ
- ఇబ్బందులు గమనించి, సడలింపు చేసిన సర్కారు




2

హైదరాబాద్ పల్స్,హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకం లబ్ధిదారులకు గుడ్‌న్యూస్ చెప్పింది. ఇందిరమ్మ నిర్మాణంలో భాగంగా కప్పు దశ దాటినా, ప్లాస్టిరింగ్ విద్యుత్తు వైరింగ్ తదితర తుది దశ పనులు చేయలేకపోతున్న లబ్ధిదారులకు ఓ వెసులుబాటు కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. నిబంధనల ప్రకారం ఇంటి నిర్మాణంలో కప్పు వరకు పూర్తయినా, బయట లోపల గోడలకు ప్లాస్టరింగ్, విద్యుత్తు అవసరాలకు వైరింగ్, గచ్చు, గోడలకు సున్నం, కలర్స్ ఇలా తదితర పనులన్నీ పూర్తి చేసినట్లు ధ్రువీకరించిన తర్వాత పూర్తయిన దశ ఫొటోలను తీసి అప్‌లోడ్ చేయాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో లబ్ధిదారుల ఇబ్బందులను గమనించిన సర్కారు సడలింపు ఇచ్చింది.

**బిల్లుల నిలిపివేతపై స్పష్టం**

ఇంటి నిర్మాణంలో బయట గోడలకు ప్లాస్టరింగ్ చేసి, లోపల చేయకున్నా, లేదంటే బయట ప్రాథమిక కోటింగ్ వేసి, లోపల వేయలేకపోయినా, అన్ని గదుల్లో గచ్చు లేకపోయినా, ముందు



### బలహీనపడేవరకు యుద్ధం కొనసాగించండి

ట్రంప్‌కు గల్ఫ్ దేశాల విజ్ఞప్తి

- ట్రంప్‌ను ప్రైవేటుగా కోరినట్లు అసోసియేటెడ్ ప్రెస్ కథనం
- ట్రంప్‌ను కోరిన దేశాల్లో సౌదీ అరేబియా, యూఏఈ, కువైట్, బహ్రెయిన్
- ఇరాన్ నాయకత్వంలో మార్పు వచ్చేవరకు సైనిక చర్య ఆగకూడదని విజ్ఞప్తి

2



### కావాలనే వేధిస్తున్నారు

సీఐడీ నోటీసులపై కౌశిక్ రెడ్డి స్పందన

- తన కుటుంబ సభ్యులను గొడవల్లోకి లాగొద్దన్న కౌశిక్ రెడ్డి
- తనది ప్రజల కోసం చేస్తున్న పోరాటమని వ్యాఖ్య
- ప్రశ్నించే గొంతును అధికార బలంతో అణచివేయలేరన్న కౌశిక్

2

### భర్త అండ లగ్జరీ కాదు...అవసరం



పితృత్వ సెలవును చట్టబద్ధమైన హక్కుగా గుర్తించాలని డిమాండ్

రాజ్యసభలో ఈ అంశాన్ని ప్రస్తావించిన ఆప్ ఎంపీ రాఘవ్ చద్దా

ప్రసవానంతరం భర్త తోడు భార్యకు అత్యంత అవసరమని వ్యాఖ్య

ప్రైవేట్ రంగంలోని 90 శాతం మందికి ఈ సౌకర్యం లేదని ఆవేదన

బిడ్డ సంరక్షణ తల్లిదండ్రుల ఉమ్మడి బాధ్యత అని స్పష్టీకరణ

2

## రైతులకు గుడ్ న్యూస్..

2

మంత్రి తుమ్మల కీలక ఆదేశాలు..

### మోదీ ఎందుకు మాట్లాడటం లేదు

కేరళలో లెఫ్ట్ కూటమి గెలుపొందాలని మోదీ కోరుకుంటున్నారు: రాహుల్ గాంధీ

సీపీఐ(ఎం) సిద్ధాంతాలకు వ్యతిరేకంగా బీజేపీతో జతకట్టిందని ఆరోపణ

కేరళలో శబరిమల బంగారం చోరీ గురించి మోదీ ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్న

కేరళ ముఖ్యమంత్రిని నరేంద్ర మోదీ నియంత్రిస్తున్నారన్న రాహుల్ గాంధీ

2



### ఐదు రోజుల పాటు వర్షాలు

ఉరుములు, మెరుపులతో కూడిన వడగళ్ల వాన కురిసే అవకాశం ఉందని వెల్లడి

గంటకు 50 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం

పలు జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసిన వాతావరణ శాఖ

2



## టోల్ ప్లాజాల వద్ద నగదుకు స్వస్తి..

నేటి నుంచి కొత్త నిబంధన!

ఇకపై ఫాస్టాగ్, యూపీఐ ద్వారా మాత్రమే చెల్లింపులు రద్దీని తగ్గించి, ప్రయాణ సమయాన్ని ఆదా చేసేందుకే ఈ నిర్ణయం


ఫాస్టాగ్ లేని వాహనాలకు జరిమానాలు విధించే అవకాశం

ఫాస్టాగ్‌లో తగినంత బ్యాలెన్స్ ఉంచుకోవాలని ప్రయాణికులకు సూచన

2

హైదరాబాద్ పల్స్,డెస్క్

దేశవ్యాప్తంగా జాతీయ రహదారులపై ప్రయాణించే వాహనదారులకు ఇది ఒక ముఖ్యమైన అప్‌డేట్. ఏప్రిల్ 1వ తేదీ నుంచి టోల్ ప్లాజాల వద్ద నగదు చెల్లింపులను పూర్తిగా నిలిపివేయనున్నట్లు నేషనల్ హైవేస్ అథారిటీ




## ప్రపంచ అశాంతికి సాంస్కృతిక వారసత్వమే పరిష్కారం

గాంధీనగర్‌లో సమ్రాట్ సంప్రతి మ్యూజియంను ప్రారంభించిన ప్రధాని మోదీ

ప్రపంచ అశాంతికి సాంస్కృతిక వారసత్వమే సమాధానమని వ్యాఖ్య

వేల ఏళ్ల నాటి జైన కళాఖండాలు, పురాణాలకు నిలయంగా మ్యూజియం

ఇది కేవలం మ్యూజియం కాదు, సాంస్కృతిక ఆరాధన కేంద్రమన్న ప్రధాని

హైదరాబాద్ పల్స్,డెస్క్

ప్రపంచం అస్థిరత్వంతో సతమతమవుతూ, అశాంతి జ్వాలలతో దహించుకుపోతున్న క్లిష్ట సమయంలో సాంస్కృతిక వారసత్వమే మానవాళికి



2

# నగదుకు స్వస్తి..

**మొదటి పేజీ రువాయి**

ఆఫ్ ఇండియా స్పష్టం చేసింది. ఇకపై టోల్ రుసుములను ఫాస్టాగ్ లేదా యూపీఐ వంటి డిజిటల్ పద్ధతుల్లో మాత్రమే చెల్లించాల్సి ఉంటుంది. ఈ మేరకు దేశంలోని అన్ని జాతీయ రహదారులు, ఎక్స్‌ప్రెస్‌వేలపై కొత్త నిబంధన అమల్లోకి రానుంది.రహదారుల వ్యవస్థను ఆధునికీకరించడంలో భాగంగా ఈ కీలక నిర్ణయం తీసుకున్నారు. టోల్ ప్లాజాల వద్ద వాహనాల రద్దీని తగ్గించి, ప్రయాణ సమయాన్ని ఆదా చేయాలనే లక్ష్యంతో నగదు రహిత విధానాన్ని అమలు చేస్తున్నారు. టోల్ వసూళ్లలో పారదర్శకతను పెంచడంతో పాటు వాహనాలు టోల్ గేట్ల వద్ద ఆగకుండా వేగంగా వెళ్లేందుకు ఇది దోహదపడుతుంది. దీనివల్ల ఇంధన వినియోగం తగ్గి, కాలుష్యం కూడా తగ్గుతుందని అధికారులు భావిస్తున్నారు.అయితే, ఈ మార్పు వల్ల డిజిటల్ చెల్లింపులకు సిద్ధంగా లేని కొంతమంది ప్రయాణికులకు ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంది. సరైన ఫాస్టాగ్ లేని లేదా అందులో తగినంత బ్యాలెన్స్ లేని వాహనాలకు జరిమానా విధించవచ్చు. కొన్ని సందర్భాల్లో అటువంటి వాహనాలను టోల్ ప్లాజా వద్ద నిలిపివేసే అవకాశం కూడా ఉంది. ప్రయాణికులు ఇబ్బంది పడకుండా ఉండేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు కూడా చేశారు. ఒకవేళ ఫాస్టాగ్‌లో సమస్య ఉంటే, టోల్ బూత్‌ల వద్ద అందుబాటులో ఉండే క్యూఆర్ కోడ్‌లను స్కాన్ చేసి యూపీఐ ద్వారా తక్షణమే చెల్లింపులు చేయవచ్చు. అయితే, కొన్నిసార్లు నెట్‌వర్క్ సమస్యల కారణంగా ఈ లావాదేవీలు ఆలస్యం కావచ్చని అధికారులు హెచ్చరిస్తున్నారు.అందువల్ల ప్రయాణికులు తమ ప్రయాణానికి ముందే ఫాస్టాగ్ గా యాక్టివ్‌గా ఉంచుకోవడం, దానిలో తగినంత బ్యాలెన్స్ ఉంచుకోవడం చేయాలని ఎన్‌హెచ్ఏఐ తెలిపింది. ఫాస్టాగ్‌ను తమ బ్యాంకు ఖాతాతో సరిగ్గా లింక్ చేసుకోవడం కూడా ముఖ్యం. ముందుజాగ్రత్తగా స్మార్ట్‌ఫోన్‌లో పనిచేసే యూపీఐ యాప్‌ను సిద్ధంగా ఉంచుకోవడం మంచిది. ఈ మార్పు భారతీయ రహదారుల వ్యవస్థను మరింత వేగవంతంగా, సమర్థవంతంగా మార్చడంలో ఒక కీలక ముందడుగుగా పరిగణిస్తున్నారు.

# బలహీనపడేవరకు యుద్ధం కొనసాగించండి

**మొదటి పేజీ రువాయి**

ఇరాన్ పూర్తిగా బలహీనపడే వరకు లేదా ఓడిపోయేవరకు యుద్ధాన్ని కొనసాగించాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు గల్ఫ్ దేశాలు విజ్ఞప్తి చేసినట్లు అసోసియేటెడ్ ప్రెస్ సంచలన కథనం వెల్లడించింది. ప్రస్తుత పాలనాయంత్రాంగం పూర్తిగా కూలిపోయేంత వరకు యుద్ధం ముగించవద్దని ట్రంప్‌ను పలు గల్ఫ్ దేశాలు ప్రైవేటుగా కోరాయి. ఈ కథనం ప్రకారం, సౌదీ అరేబియా, యూఏఈ, కువైట్, బహ్రెయిన్ దేశాలు ట్రంప్‌ను కోరాయి.నెల రోజులుగా యుద్ధం జరుగుతున్నప్పటికీ ఇరాన్ అంతగా బలహీనపడలేదని, కాబట్టి యుద్ధాన్ని కొనసాగించాలని ఆ దేశాలు కోరాయి. ఇరాన్ నాయకత్వంలో గణనీయమైన మార్పు రావాలని, అప్పటి వరకు సైనిక చర్య ఆగకూడదని ఆ దేశాల అధికారులు ప్రైవేటు సంభాషణలో భాగంగా ట్రంప్‌ను కోరినట్లు ఆ కథనం తెలిపింది.అయితే, యుద్ధం ప్రారంభానికి ముందు తమకు సమాచారం ఇవ్వకపోవడం, యుద్ధం కారణంగా సంభవించే హెచ్చరికలను పట్టించుకోకపోవడంపై ఈ చర్చల సందర్భంగా ఆయా దేశాలు అసంతృప్తి వ్యక్తం చేశాయని తెలుస్తోంది. యుద్ధం ఎలాగూ ప్రారంభమైనందున, టెహ్రాన్ పాలనను పూర్తిగా కూలదోయాలని, ఇది చరిత్రాత్మక అవకాశమని కొన్ని దేశాలు అభిప్రాయం వ్యక్తం చేశాయని ఆ కథనం పేర్కొంది.

# ప్రపంచ అశాంతికి సాంస్కృతిక వారసత్వమే పరిష్కారం

**మొదటి పేజీ రువాయి**

మార్గం చూపుతుందని ప్రధాని నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు.మహావీర్ జయంతి సందర్భంగా గుజరాత్‌లోని గాంధీనగర్‌లోని కోబా తీర్థ్‌లో ఏర్పాటు చేసిన 'సమ్రాట్ సంప్రతి మ్యూజియం'ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈ మ్యూజియం ఇచ్చే సందేశం కేవలం భారతదేశానికే కాకుండా యావత్ ప్రపంచానికి అత్యంత కీలకమని అన్నారు.అశోక చక్రవర్తి మనవడు, అహింసా మార్గాన్ని ప్రచారం చేసిన సమ్రాట్ సంప్రతి పేరుతో ఈ మ్యూజియంను ఏర్పాటు చేశారు. దేశవ్యాప్తంగా సేకరించిన జైన సమాజానికి చెందిన అమూల్యమైన కళాఖండాలను ఇక్కడ ప్రదర్శనకు ఉంచారు. వీటిలో కొన్ని 1000 సంవత్సరాల కంటే పురాతనమైనవి కావడం విశేషం. దశాబ్దాల పాటు తమ జీవితాలను అంకితం చేసి, భారతదేశం, నేపాల్ నుంచి ఈ కళాఖండాలను సేకరించిన జైన సన్యాసి ఆచార్య పద్మసాగర్ సూరీశ్వర్జీ సేవలను ప్రధాని ఈ సందర్భంగా కొనియాడారు.ఈ మ్యూజియం కేవలం కళాఖండాల భాండాగారం మాత్రమే కాదని, ఇది జైన ఆరాధనకు, సంస్కృతికి, వారసత్వ పరిరక్షణకు ఒక శక్తిమంతమైన కేంద్రమని ప్రధాని మోదీ అభివర్ణించారు. కోబా తీర్థ్ ఎంతో కాలంగా శాంతికి, ఆధ్యాత్మిక సాధనకు నెలవుగా ఉందని గుర్తుచేశారు. ఈ మ్యూజియం రూపకల్పనలో వేదాలు, పురాణాలు, ఆయుర్వేదం వంటి భారతీయ సంప్రదాయాలు ప్రతిబింబిస్తాయని, ఇది మన భిన్నత్వంలో ఏకత్వానికి నిదర్శనమని పేర్కొన్నారు. విద్యార్థులు, పరిశోధకులు ఈ కేంద్రాన్ని పెద్ద సంఖ్యలో సందర్శించాలని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ మ్యూజియంలో జైన తత్వశాస్త్రం, తీర్థంకరుల జీవితాలు, ప్రాచీన తాళపత్ర గ్రంథాలు, ఆలయ నమూనాలు, చారిత్రక కళాఖండాలతో కూడిన ఏడు గ్యాలరీలు ఉన్నాయి. సంప్రదాయ ప్రదర్శనలతో పాటు ఆధునిక డిజిటల్, ఆడియో-విజువల్ టెక్నాలజీని మేళవించి సందర్శకులకు ఒక ప్రత్యేకమైన అనుభూతిని అందిస్తున్నారు.

**'వికాస్ భీ, విరాసత్ భీ'కి ఇది నిదర్శనమన్న గుజరాత్ ప్రభుత్వం**

ఈ కార్యక్రమంలో పాల్గొన్న గుజరాత్ సీఎం భూపేంద్ర పటేల్, ఈ మ్యూజియం సాంస్కృతిక పరిరక్షణ కేంద్రంగా నిలుస్తుందని అన్నారు. డిప్యూటీ సీఎం హర్ష్ సంఘ్వీ మాట్లాడుతూ.. 'వికాస్ భీ, విరాసత్ భీ' (అభివృద్ధి, వారసత్వం రెండూ) అనే ప్రభుత్వ దార్శనికతకు ఈ మ్యూజియం నిదర్శనమని, ప్రధాని చేతుల మీదుగా ఇది ప్రారంభం కావడం జైన సమాజానికి గర్వకారణమని తెలిపారు.

# భర్త అండ లగ్జరీ కాదు...అవసరం

**మొదటి పేజీ రువాయి**

పితృత్వ సెలవును దేశవ్యాప్తంగా అన్ని రంగాల్లో చట్టబద్ధమైన హక్కుగా మార్చాలని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) రాజ్యసభ ఎంపీ రాఘవ్ చద్దా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.పార్లమెంట్ సమావేశాల సందర్భంగా ఆయన ఈ అంశాన్ని లేవనెత్తారు. బిడ్డ సంరక్షణ బాధ్యత కేవలం తల్లులకే పరిమితం కాదని, అది తల్లిదండ్రులిద్దరి ఉమ్మడి బాధ్యత అని ఆయన స్పష్టం చేశారు.ఈ సందర్భంగా రాఘవ్ చద్దా మాట్లాడుతూ.. "బిడ్డ పుట్టినప్పుడు తల్లిదండ్రులిద్దరికీ శుభాకాంక్షలు వెల్లువెత్తుతాయి, కానీ సంరక్షణ బాధ్యత మాత్రం చట్టపరంగా తల్లిపైనే పడుతోంది. ఇది చట్టం బలవంతంగా రుద్దుతున్న సామాజిక వైఫల్యం" అని వ్యాఖ్యానించారు. ప్రసవానంతరం ఒక మహిళకు శారీరకంగా, మానసికంగా, భావోద్వేగపరంగా భర్త అండ ఎంతో అవసరమని ఆయన అన్నారు. "ఆ సమయంలో భర్త తోడు విలాసం (లగ్జరీ) కాదు, అత్యవసరం. భార్య పట్ల భర్తకు ఉండే సంరక్షణ బాధ్యత కూడా అంతే ముఖ్యం" అని సభకు వివరించారు.ప్రస్తుతం దేశంలో కేవలం కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు మాత్రమే 15 రోజుల పితృత్వ సెలవు లభిస్తోందని, ప్రైవేట్ రంగంలో అలాంటి నిబంధన ఏదీ లేదని చద్దా గుర్తుచేశారు. దేశంలోని 90 శాతం మంది ఉద్యోగులు ప్రైవేట్ రంగంలోనే ఉన్నారని, దీనివల్ల అత్యధిక మంది తండ్రులు ఈ సౌకర్యానికి దూరమవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.స్వీడన్, ఐస్‌లాండ్, జపాన్ వంటి దేశాలు 90 రోజుల నుంచి 52 వారాల వరకు పితృత్వ సెలవులు కల్పిస్తున్నాయని ఉదహరించారు. బిడ్డ సంరక్షణ, ఉద్యోగం రెండింటి మధ్య తండ్రి దేన్ని ఎంచుకోవాలన్న పరిస్థితి రాకూడదని, అదే సమయంలో భర్త మద్దతు లేకుండా తల్లి ప్రసవ వేదనను ఎదుర్కోకూడదని అన్నారు. కావున ప్రభుత్వం వెంటనే ఈ విషయంలో జోక్యం చేసుకుని, పితృత్వ సెలవును చట్టబద్ధమైన హక్కుగా మార్చేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

# కావాలనే వేధిస్తున్నారు

**మొదటి పేజీ రువాయి**

తనకు సీఐడీ నోటీసులు అందడంపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఎక్స్ వేదికగా తీవ్రంగా స్పందించారు. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నాననే కక్షతోనే తనను ఇబ్బంది పెడుతున్నారని ఆయన ఆరోపించారు. "రేవంత్ రెడ్డి గారు... నన్ను లక్ష్యంగా చేసుకోండి, నాపై ఎన్ని కేసులైనా పెట్టండి, నోటీసులు ఇవ్వండి. కానీ నా కుటుంబాన్ని, మా బీఆర్ఎస్ కుటుంబ సభ్యులను ఈ గొడవల్లోకి లాగి ఇబ్బంది పెట్టడం ఎంతవరకు న్యాయం?" అని ప్రశ్నించారు. ఏ తప్పు చేయకపోయినా కావాలనే వేధిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.ఎన్ని నోటీసులు ఇచ్చినా, ఎన్ని బెదిరింపులకు గురిచేసినా తాను వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. "ఇది నా వ్యక్తిగత పోరాటం కాదు, ప్రజల కోసం చేస్తున్న పోరాటం. మీరు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు మిమ్మల్ని నిలదీస్తూనే ఉంటాను" అని హెచ్చరించారు. ప్రశ్నించే గొంతును అధికార బలంతో అణచివేయలేరని, ప్రజల పక్షాన తన పోరాటం నిరంతరం కొనసాగుతుందని అన్నారు.జనవరి 29న హుజూరాబాద్ నియోజకవర్గం వీణవంకలో జరిగిన మినీ మేడారం జాతర సందర్భంగా పోలీసులతో కౌశిక్ రెడ్డి వాగ్వాదానికి దిగారు. ఈ సందర్భంగా కరీంనగర్ పోలీస్ కమిషనర్ పై అనుచిత వ్యాఖ్యలు చేశారు. ఈ నేపథ్యంలో, ఆయనపై కేసు నమోదయింది. ఈ క్రమంలో, ఏప్రిల్ 4న విచారణకు హాజరుకావాలని సీఐడీ అధికారులు నోటీసులు జారీ చేశారు.

# ఇందిరమ్మ లబ్ధిదారులకు గుడ్‌న్యూస్

**మొదటి పేజీ రువాయి**

దర్వాజ తలుపులు ఉండి, లోపలి గదులకు తలుపులు ఏర్పాటు చేయలేకున్నా, పూర్తి స్థాయి వైరింగ్, ప్లంబింగ్ పనులు పూర్తి చేయకపోయినా ఆఖరి బిల్లు కోసం లబ్ధిదారుతో ఉన్న ఇంటి చిత్రాల్ని తీసి బిల్లు కోసం సిఫార్సు చేసేందుకు అవకాశం కల్పించారు. ఈ మేరకు హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ వీపీ గౌతమ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇలా చిన్న చిన్న హంగుల కోసం బిల్లులు నిలిపివేసే పరిస్థితి ఇకపై ఉండదని స్పష్టం చేశారు.ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలో 42,627 గృహాలు మంజూరు అయ్యాయి. అందులో 16,949 ఇళ్లు కప్పు దశ వరకు పూర్తయ్యాయి. ఇవన్నీ తుది దశలోనే ఉన్నందున వీటికి చివరి బిల్లు మంజూరయ్యే అవకాశం ఉంది. ప్రభుత్వ ఉత్తర్వులు, జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం ఇలాంటి ఇళ్లను గుర్తించి బిల్లులకు సిఫార్సు చేసేందుకు సర్వే చేస్తున్నారని జనగామ జిల్లా పీడీ మాతృనాయక్ వివరించారు

**2 నెలల్లో రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల ప్రకటన :** మరోవైపు రాష్ట్రంలో ప్రతి ఏడాది ఇందిరమ్మ గృహాలు మంజూరు చేస్తామని, 2026-27 ఆర్థిక సంవత్సరానికి రెండు నెలల్లో రెండో విడత ప్రకటిస్తామని గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. అంతేకాదు గతంలో మంజూరై, సగంలో నిలిచిపోయిన గృహాలను పూర్తి చేసేలా అవసరమైన ఆర్థిక సహాయం అందించేందుకు వచ్చే ఏడాది పథకంలో వివరిస్తామని పేర్కొన్నారు. ఇందిరమ్మ తొలి దఫా పథకంలో మార్చి నెలాఖరు నాటికి లక్ష గృహాలు, జూన్?, జులై వరకు మొత్తం 3 లక్షల నిర్మాణాలు పూర్తవుతాయని వెల్లడించారు.బ్యాంకు రుణాలతో కార్లు కొనుగోలు చేసి డ్రైవర్లుగా కొనసాగుతున్న వారిని లబ్ధిదారుల జాబితాలో చేర్చలేదని, అర్హులందరికీ న్యాయం జరిగేలా ఇందిరమ్మ గృహాల పథకం నిబంధనల్లో మార్పులు చేయాలని మండలి ఛైర్మన్? గుత్తా సుఖేందర్?రెడ్డి మంత్రికి సూచించారు. రాష్ట్రంలో 4.50 లక్షల ఇందిరమ్మ ఇళు మంజూరు చేశామని పొంగులేటి తెలిపారు. త్వరలో మరో టోల్? ఫ్రీ నంబర్? అందుబాటులోకి తెస్తామని చెప్పారు.

# 'పహిల్వాన్' భాష మాట్లాడుతున్నారు

**మొదటి పేజీ రువాయి**

పోటీలు ఉండవని ఎద్దేవా చేశారు. అసెంబ్లీని కుస్తీల పోటీగా మార్చారని మండిపడ్డారు. కత్తులతో కోలాటంలో తలలు తీసేస్తామని మరో ఎమ్మెల్యే వ్యాఖ్యానించారని మండిపడ్డారు. ఇలాంటి వ్యాఖ్యలను ఎథిక్స్ కమిటీకి రిఫర్ చేయాలని కోరారు.గడిచిన రెండున్నర సంవత్సరాలలో రేవంత్ రెడ్డి సభలో మాట్లాడిన ఎన్నో అనాగరిక వ్యాఖ్యలను ఎథిక్స్ కమిటీకి రిఫర్ చేయాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీలో తమ గొంతు నొక్కివేసే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ప్రజాక్షేత్రంలో ప్రభుత్వం వైఫల్యాలను నిలదీస్తూనే ఉంటామని హెచ్చరించారు. అసెంబ్లీని కూడా ఈ ప్రభుత్వం ఇష్టం వచ్చినట్లు నడుపుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.టీ బ్రేక్ పేరుతో, రేవంత్ రెడ్డి ఢిల్లీకి వెళుతున్నారని, ముఖ్యమంత్రి కేరళ నుంచి వస్తున్నారని, ఆర్థిక మంత్రి ప్రిపేర్ అవుతున్నారని, లంచ్ బ్రేక్ అంటూ ఇలా వివిధ కారణాలతో సభను గంటల పాటు వాయిదా వేస్తున్నారని ఆరోపించారు. ప్రజా సమస్యలు చర్చకు రాకుండా వివిధ కారణాలతో అసెంబ్లీ సమయాన్ని వృథా చేశారని మండిపడ్డారు. కావాలని సభను రాత్రి వరకు నడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.కేరళ ఎన్నికల కోసం శాసనసభను 30వ తేదీనే నిరవధిక వాయిదా వేశారని ఆరోపించారు. కేరళ ఎన్నికలు కాంగ్రెస్ పార్టీకి అవసరమేమో కానీ తెలంగాణ ప్రజలకు, బీఆర్ఎస్ శాసనసభ్యులకు ప్రజా సమస్యలు ముఖ్యమని అన్నారు.

**రేవంత్ రెడ్డి, సీఆర్ పాటిల్ వ్యాఖ్యలకు తేడా లేదు**

కాళేశ్వరం ప్రాజెక్టుపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్రమంత్రి సీఆర్ పాటిల్ వ్యాఖ్యలకు పెద్దగా తేడా లేదని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వమే అన్ని అనుమతులు ఇచ్చిందని గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం, కేంద్ర మంత్రులు, సుప్రీంకోర్టు కూడా కాళేశ్వరం చాలా గొప్ప ప్రాజెక్టు అని ప్రశంసించాయని అన్నారు. కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ లాంటి వారు కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణాకు వరప్రదాయిని అని అన్నారని గుర్తు చేశారు.ఇటీవల పార్లమెంటులో కేంద్ర ప్రభుత్వం పెట్టిన ఎకనామిక్ సర్వేలో కాళేశ్వరం వల్ల సాగు భూమి విస్తీర్ణత పెరిగిందని చెప్పిందని వెల్లడించారు. అసెంబ్లీలో ఉత్తమ్ కుమార్ రెడ్డి కూడా కాళేశ్వరం వల్ల గత రెండేళ్లలో వేల ఎకరాల సాగు భూమి విస్తీర్ణత పెరిగిందని నివేదిక పెట్టారని తెలిపారు. ఆలేరు నియోజకవర్గంలో గంధమల్ల ప్రాజెక్టుకు, మూసీలో తెచ్చే గోదావరి నీళ్లు కాళేశ్వరం నుండి వస్తున్నాయని తెలిపారు.సీఆర్ పాటిల్ తెలంగాణకు వచ్చి ఇక్కడ రైతులను నీళ్లు ఎక్కడి నుంచి వస్తున్నాయని అడిగితే సమాధానం వస్తుందని అన్నారు. కేవలం బీఆర్ఎస్ పార్టీ మీద బురదజల్లడానికే కాళేశ్వరం గురించి తప్పుగా మాట్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మరో రూ.50 కోట్లు ఖర్చు చేస్తే మరో 2 లక్షల ఎకరాల ఆయకట్టు వస్తుందని రెండేళ్ల నుంచి దాదాపు 20 లేఖలు రాస్తున్నా ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పందించడం లేదని ఆరోపించారు. మా మీద కోపం ఉంటే తీర్చుకోవచ్చు... కానీ ఆ కోపాన్ని రైతుల మీద చూపించవద్దని కోరారు.

# మోదీ ఎందుకు మాట్లాడటం లేదు

**మొదటి పేజీ రువాయి**

కేరళలో లెఫ్ట్ కూటమి గెలుపొందాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ కోరుకుంటున్నారని కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకుడు రాహుల్ గాంధీ ఆరోపించారు. సీపీఐ(ఎం) వామపక్ష పార్టీ కాదని, అతివాద రైట్ వింగ్ పార్టీ అని విమర్శించారు. సిద్ధాంతాలకు వ్యతిరేకంగా లెఫ్ట్ పార్టీ నేతలు బీజేపీతో జతకట్టారని అన్నారు. అందుకే కేరళలో ఎల్డీఎఫ్ గెలుపొందాలని మోదీ కోరుకుంటున్నారని అన్నారు.కన్నూరులో జరిగిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడుతూ, మోదీ ప్రతిచోట మతం, దేవుడి గురించి మాట్లాడుతారని, కానీ కేరళలో మాత్రం కనీసం శబరిమల బంగారం చోరీపై కూడా మాట్లాడటం లేదని మండిపడ్డారు. బంగారు తాపడాలు మాయం కావడం వెనుక సీపీఐ నేతల హస్తం ఉందని ఆరోపించారు. సీపీఐతో జతకట్టడం వల్లే బీజేపీ నాయకులు శబరిమల అంశంపై మాట్లాడటం లేదని అన్నారు.బీజేపీతో జతకట్టడం సీపీఐలోని కొంతమంది నాయకులకు ఇష్టం లేదని, అందుకే వారు యూడీఎఫ్ మద్దతుతో స్వతంత్రులుగా ఎన్నికల్లో పోటీ చేస్తున్నారని అన్నారు. శబరిమల ఆలయంలో బంగారం చోరీకి సంబంధించి సీపీఐ(ఎం) నాయకులపై బీజేపీ ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.బీజేపీ, ఇక్కడి ఎల్డీఎఫ్ మధ్య ఒక అవగాహన ఉందని ఆరోపించారు. కేరళ ముఖ్యమంత్రిని నరేంద్రమోదీ నియంత్రిస్తున్నారని వ్యాఖ్యానించారు. కేరళ ముఖ్యమంత్రిని జైల్లో పెట్టగలిగే తాళం చెవి మోదీ వద్ద ఉందని, కానీ ఆయన చర్యలు మాత్రం తీసుకోరని అన్నారు.

# తెలంగాణలో ఐదు రోజుల పాటు వర్షాలు

**మొదటి పేజీ రువాయి**

తెలంగాణ రాష్ట్రంలో ఐదు రోజుల పాటు వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఈరోజు, రేపు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వడగళ్ల వాన కురిసే అవకాశం ఉందని తెలిపింది. గంటకు 50 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది.ఈరోజు, రేపు పలు జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసింది. ఆదిలాబాద్, అసిఫాబాద్, నిర్మల్, నిజామాబాద్, కామారెడ్డి, సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసింది. రేపు కామారెడ్డి, సంగారెడ్డి, మెదక్, వికారాబాద్ జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసింది. హైదరాబాద్ నగరంలో ఆకాశం మేఘావృతమై ఈరోజు, రేపు తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశముందని వెల్లడించింది.

# రైతులకు గుడ్ న్యూస్..

**మొదటి పేజీ రువాయి**

హైదరాబాద్, మార్చి 31: పసుపు రైతులకు ఊరటనిస్తూ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కీలక ఆదేశాలు జారీ చేశారు. అకాల వర్షాలతో పసుపు పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పూర్తి అండగా ఉంటుందని చెప్పారు. తడిసిన పసుపును కోతలు లేకుండా కొనుగోలు చేయాలని మంత్రి తుమ్మల ఆదేశించారు. తేమ పేరుతో రైతులను ఇబ్బంది పెట్టొద్దని అధికారులను హెచ్చరించారు. మార్కెట్ యార్డు అధికారులు రైతులను ఇబ్బంది పెడితే.. కఠిన చర్యలు తీసుకుంటామంటూ మంత్రి తుమ్మల వార్నింగ్ ఇచ్చారు.మంగళవారం నాడు మీడియాతో మాట్లాడిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు.. నిజామాబాద్ మార్కెట్‌కు భారీగా పసుపు వచ్చిందన్నారు. 4,500 కుప్పలు (27,400 బస్తాలు) యార్డుకు చేరిందన్నారు. 500 కుప్పలు బహిరంగ ప్రదేశాల్లో నిల్వ ఉందని చెప్పిన మంత్రి.. పసుపు రక్షణకు 1,500 టార్పాలిన్‌లు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. గాలులు, వర్షాలతో 70 - 80 కుప్పలు తడిశాయన్నారు. దీని కారణంగా దాదాపు 40 మంది రైతులకు నష్టం వాటిల్లిందన్నారు. తడిసిన పసుపును పూర్తి తూకంతో కొనుగోలు చేయాలని మార్కెట్ యార్డ్ అధికారులను ఆదేశించారు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు.

# ఐటీసీ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

**14వ వార్డు మెంబర్ కొమరం సావిత్రి**




**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చి 31; భద్రాద్రి జిల్లా ప్రతినిధి :**
బూర్గంపహాడ్ మండలం సారపాక గ్రామంలో జరుగుతున్న ఐ టి సి కాంట్రాక్ట్ కార్మికుల న్యాయమైన సమస్యలను యజమాన్యం వెంటనే పరిష్కరించాలని సారపాక మేజర్ గ్రామపంచాయతీ 14వ వార్డ్ మెంబర్ కొమరం సావిత్రి డిమాండ్ చేశారు. మంగళవారం ఐటిసి పేపర్ పరిశ్రమ సమీపంలో గత ఆరు రోజులుగా నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షల సమ్మె శిబిరాన్ని కొమరం సావిత్రి సందర్శించారు ఈ సందర్భంగా కాంట్రాక్ట్ కార్మికుల సమ్మెకు తమ సంపూర్ణ మద్దతు తెలియజేసినారు. కాంట్రాక్ట్ కార్మికులు చేస్తున్న డిమాండ్లు చాలా న్యాయమైనయని యజమాన్యం పరిష్కరించే సమస్యలనే వారి దృష్టికి తీసుకువెళ్తానని కొమరం సావిత్రి తెలిపారు. ఒకపక్క కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం 4 లేబర్ కోడ్లను తీసుకువచ్చి కాంట్రాక్ట్ కార్మికుల జీవితాలతో చెలగాటమాడుతూ మరోపక్క యజమాన్యాలు సమాన పనికి సమాన వేతనాలు ఇవ్వకుండా వెట్టి చాకిరి చేయించుకోవడం సమంజసం కాదని అన్నారు. గత 13 అగ్రిమెంట్లు చేసిన తరుణంలో తమకు అన్యాయం జరిగింది, కాబట్టే ఈ 14వ అగ్రిమెంట్లోనైనా తమకు గౌరవం గా గుర్తించి వేతనాల పెంపుదలకు కాంట్రాక్ట్ కార్మికులతో చేస్తారని ఆశతో మాత్రమే ఈ నిరసన కార్యక్రమం వాళ్ళు చేస్తున్నట్లు ఉందని అన్నారు. ఐటీసీ యాజమాన్యం గుర్తింపు సంఘం కాంట్రాక్టు కార్మికుల కష్టాన్ని గుర్తించాలని అందుకు అనుగుణంగా పెరుగుతున్న ధరలను భరించాలంటే కాంట్రాక్టు కార్మికుల వేతనాలు పెంచాల్సిన అవసరం ఉందని తెలిపారు. కాంట్రాక్ట్ కార్మికుల పోరాటాన్ని సంబంధిత లేబర్ అధికారులు గుర్తించి యజమాన్యంతో చర్చలు జరిపి కాంట్రాక్ట్ కార్మికుల కోరికలు ఏవైతే ఉన్నాయో వాటి పరిష్కారానికి మార్గం చూపాలని కోరారు. కాంట్రాక్ట్ కార్మికుల సమ్మెకు సంపూర్ణ మద్దతు తెలియజేయడమే కాకుండా ప్రత్యక్షంగా వారు నిర్వహించే ఆందోళన పోరాటంలో భాగస్వామిని అవుతానని ఆమె తెలిపారు. కాంట్రాక్ట్ కార్మికుల సంక్షేమం కోసం వారి సమస్యల పరిష్కారం కోసం తన వంతుగా కృషి చేస్తానని ఆ మేరకు అండగా ఉంటానని భరోసా కల్పించారు.

# విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం కృషి

**50 శాతం ఫిట్మెంట్ తో పిఆర్సి వెంటనే ప్రకటించాలి**
**సానుకూలంగా స్పందిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి**
**పిఆర్టియు రాష్ట్ర అధికార ప్రతినిధి వంగ మహేందర్ రెడ్డి**




**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చ్ 31, సిద్దిపేట జిల్లా:**
విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో పిఆర్టియు ముందుండి పోరాటం చేస్తుండగా, ఇప్పటికే వివిధ సమస్యలను సీఎం రేవంత్ రెడ్డి ముందుంచినట్లు పిఆర్టియు రాష్ట్ర అధికార ప్రతినిధి వంగ మహేందర్ రెడ్డి పేర్కొన్నారు. వర్గల్ మండలం మజీద్ పల్లి ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు గాయత్రీ దేవి ఉద్యోగ విరమణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మండల శాఖ బాధ్యులు చంద్రశేఖర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ఐదు దశాబ్దాల సంఘ ఆవిర్భావం నుండి ఉపాధ్యాయులకు మెరుగైన సౌకర్యాలు, ఎన్నో రాయితీలు కల్పించిన ఘనత పిఆర్టియు సంఘానికి దక్కుతుందని స్పష్టం చేశారు. ముఖ్యంగా సంఘనీడలో ఉన్న ప్రతి ఉపాధ్యాయుడికి అండగా ఉంటుండగా, నిబద్ధత, కర్తవ్య నిష్టతతో విశిష్ట సేవలందించిన సంఘం ప్రతి ఉపాధ్యాయుడికి గౌరవం, గుర్తింపు తెచ్చిందని తెలిపారు. కాగా 50 శాతం ఫిట్మెంట్ తో ప్రభుత్వం వెంటనే పిఆర్సి ప్రకటించాలని డిమాండ్ చేశారు. పిఆర్సి కాలపరిమితి ముగిసి 30 నెలలు దాటుతున్న కమిటీ పేరుతో ప్రభుత్వం కాలయాపన చేస్తున్నట్లు విమర్శించారు. అలాగే ప్రభుత్వం ఉపాధ్యాయుల కు చెల్లించాల్సిన పెండింగ్ బిల్లులను మంజూరి చేయాలని, రిటైర్మెంట్ ఉద్యోగుల బకాయలు ఒకే విడతలు చెల్లించాలని కోరారు. అయితే పదవి విరమణ పొందుతున్న గాయత్రీ దేవి విధి నిర్వహణలో మెరుగైన సేవలు అందించగా, సంఘ పటిష్టతకు కృషి చేసినట్లు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి సునీత, రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాపరెడ్డి, పిఆర్టియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఇంద్రసేనారెడ్డి, శశిధర శర్మ, మండల సంఘ ప్రధాన కార్యదర్శి నరసింహా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# గడ్డిమందు నిషేధంపై ఎమ్మెల్యే డాక్టర్ రామచంద్ర నాయక్ కృతజ్ఞతలు

**మహబూబాబాద్ జిల్లా మైనార్టీ నాయకులు మహమ్మద్ జానీమియా**



**మహబూబాబాద్, మార్చి 31, హైదరాబాద్ పల్స్ ప్రతినిధి :**
మహబూబాబాద్ జిల్లాలో పారాక్వాట్ గడ్డిమందు వల్ల పెరుగుతున్న ప్రాణనష్టాల అంశాన్ని అసెంబ్లీలో ప్రస్తావించి ప్రజల ప్రాణాలను కాపాడే దిశగా కీలకంగా స్పందించిన ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రామచంద్రనాయక్‌కు మహబూబాబాద్ జిల్లా మైనార్టీ నాయకులు మహమ్మద్ జానీమియా హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం మీడియా సమావేశంలో జానీమీయా మాట్లాడుతూ, ప్రమాదకర గడ్డిమందు వల్ల అనేక కుటుంబాలు విషాదంలో మునిగిపోతున్న పరిస్థితిని గుర్తించి అసెంబ్లీలో లేవనెత్తడం అభినందనీయమని పేర్కొన్నారు. ప్రభుత్వం తీసుకున్న నిషేధ నిర్ణయం ద్వారా ఇకపై క్షణికావేశంలో జరిగే ప్రాణనష్టాలు తగ్గుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ నిర్ణయం వల్ల ప్రజల ప్రాణాలు కాపాడబడటమే కాకుండా భూసారం కూడా సంరక్షించబడుతుందని, దీని ద్వారా వ్యవసాయ రంగానికి కూడా మేలు జరుగుతుందని తెలిపారు. రైతులు ఆరోగ్యకరమైన పద్ధతుల్లో సాగు చేసుకునే పరిస్థితులు ఏర్పడతాయని చెప్పారు.ప్రజా ప్రయోజనాల దృష్ట్యా సమయానికి స్పందించి సమస్యను అసెంబ్లీలో ప్రస్తావించిన ఎమ్మెల్యే డాక్టర్ రామచంద్ర నాయక్,ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తూ, ఇలాంటి నిర్ణయాలు భవిష్యత్తులో మరిన్ని ప్రాణాలను కాపాడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

# చైనా సీసీ కెమెరాలు బ్యాన్ చేసిన ఇండియా: కారణం ఇదే




**హైదరాబాద్ పల్స్ న్యూస్ మార్చ్ 31, న్యూఢిల్లీ:**
మేకిన్ ఇండియాకు ప్రాధాన్యమిస్తోన్న కేంద్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. కొత్త స్టాండర్డైజేషన్ టెస్టింగ్ అండ్ క్వాలిటీ సర్టిఫికేషన్ నిబంధనల కింద చైనాలో తయారైన సీసీ కెమెరాలకు ధృవీకరణ పత్రం ఇవ్వడానికి ప్రభుత్వం నిరాకరించింది. దీంతో చైనాకు చెందిన ప్రముఖ సీసీ కెమెరాల కంపెనీలు హికివిజన్, దహువాకు బిగ్ షాక్ తగిలినట్టైంది.కేంద్ర ప్రభుత్వం నిర్ణయంతో 2026, ఏప్రిల్ 1 నుంచి దేశంలో హికివిజన్, దహువా కంపెనీల ఇంటర్నెట్-కనెక్టెడ్ సీసీ కెమెరాల విక్రయాలపై నిషేధం అమల్లోకి రానుంది. దేశంలో ఎవరైనా ఈ కంపెనీల సీసీ కెమెరాలను అమ్మితే చట్టరీత్యా నేరం. ప్రస్తుతం దేశంలోని సీసీ కెమెరాల మార్కెట్లో సింహభాగం చైనా కంపెనీలదే. 80 శాతం వాటా చైనా కంపెనీల చేతుల్లోనే ఉంది. కేవలం 20 పర్సెంట్ మాత్రమే భారత కంపెనీల వాటా. అమ్మకాలలో దాదాపు మూడింట ఒక వంతు వాటా చైనాదే.ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ తాజా నిర్ణయంతో చైనా కంపెనీలు భారత సీసీ కెమెరాల మార్కెట్ నుంచి దుకాణం సర్దుకోవాల్సిన పరిస్థితి అనివార్యమైంది. ఇది భారతీయ కంపెనీలకు సువర్ణావకాశంగా అభివర్ణిస్తున్నారు నిపుణులు. ఒకప్పుడు చైనా బ్రాండ్లు గుత్తాధిపత్యం చెలాయించిన మార్కెట్ ఇప్పుడు భారతీయ కంపెనీల నియంత్రణలో ఉంది. ప్రస్తుతం దేశ సీసీ కెమెరాల మార్కెట్లో భారతీయ కంపెనీల వాటా 80 శాతానికి పెరిగింది. సీపీ ప్లస్, క్యూబో, ప్రామా, మ్యాట్రిక్స్, స్పర్ష్ వంటి దేశీయ బ్రాండ్లు ఆధిపత్యం చెలాయిస్తున్నాయి.

# ప్రతి ఒక్కరూ సంతోషంగా ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యం

**- కోహీర్ లో ఇందిరమ్మ ఇండ్ల పట్టాల పంపిణి**
**- కోహీర్ మున్సిపల్ చైర్మన్ ఎం. అశోక్**



హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చ్ 31, జహీరాబాద్:
కోహీర్ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా ప్రభుత్వం అన్నారు కోహీర్ మున్సిపల్ చైర్మన్ ఎం. అశోక్ అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేరుస్తుందని ఆయన అన్నారు. ఇచ్చిన మాట ప్రకారం పేదలందరికి ఇందిరమ్మ ఇళ్ళు ఇస్తున్నారని ఆయన అన్నారు. ఎన్నో ఏళ్ళుగా సొంత ఇంటి కోసం ఎదురు చూస్తున్న పేదల కలను కాంగ్రెస్ ప్రభుత్వం సాకారం చేసిందని ఆయన అన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో మాటలు చెప్పింది తప్ప చేసింది శూన్యం అని ఆయన విమర్శించారు. మొదటి విడతలో స్థలం ఉన్న వారికి ఇళ్లను కేటాయించారని ఆయన తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లకు ప్రభుత్వం ఐదు లక్షల రూపాయలు ఇస్తుందని ఆయన పేర్కొన్నారు. ఇందిరమ్మ ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉండాలనే అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిందని ఆయన చెప్పారు. ఎన్నో ఏళ్ళు గా ఎదురు చూస్తున్న సొంతింటి కల నెరవేరడంతో ఇందిరమ్మ ఇళ్ల పట్టాలు పొందిన లబ్దిదారులు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ హన్నాన్ జావీద్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు శంషార్ అల్లి, షాకీర్ అలీ మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ కార్పొరేషన్ లోన్ల ఆన్లైన్ గడువు ఏప్రిల్ 8 వరకు పెంపు

**జిల్లా కలెక్టర్ అంకిత్, ఐ.ఏ.ఎస్**




**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చి 31, భద్రాద్రి జిల్లా ప్రతినిధి :**
జిల్లా షెడ్యూల్డ్ కులముల సేవా సహకార అభివృద్ధి సంఘం లి" భద్రాద్రి కొత్తగూడెం ద్వార అమలు చేస్తున్న యస్సీ కార్యచరణ ప్రణాళిక 2025-26 పథకాల నమోదుకు దరఖాస్తు గడువును ఏప్రిల్ 8 వ తేది వరకు పొడగించినట్లు జిల్లా కలెక్టర్ అంకిత్, ఐ.ఏ.ఎస్. ఒక ప్రకటనలో తెలిపారు. బ్యాంకు అనుసందానం తో రవాణా విభాగానికి సంబంధించి ఈ వి ద్విచక్ర వాహనాలు, త్రిచక్రాల గూడ్స్ పాసెంజర్ వాహనాలు, పశుసంవర్ధక రంగంలో పాడి పశు వులు మరియు సోలార్ పంప్ సెట్ వంటి పథకాలకు అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. అర్హులైన ఆసక్తి కల అభ్యర్థులు ఆన్లైన్ పోర్టల్ https://tgobmms.cgg.gov.in ద్వారా దరఖాస్తు నమోదు చేసుకొని దరఖాస్తు ఫారమ్ ను డౌన్లోడ్ చేసుకొని హార్డ్ కాపీని మరియు అవసరమైన పత్రాలను జత పరచి గ్రామీణ ప్రాంతాల వారు ఎంపిడిఓ కార్యాలయం లో (లేదా) పట్టణ ప్రాంతాల వారు మున్సిపల్ కార్యాలయం లో సమర్పించాలని తెలియజేసారు. మరిన్ని వివరాల కొరకు 9849905990 ను సంప్రదించాలని తెలిపారు.

# మనందరి కర్తవ్యం - నశాముక్త్ భారత్

**రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పట్లోళ్ల చంద్రశేఖర్ రెడ్డి**





**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చ్ 31, నారాయణఖేడ్ :**
భారతదేశం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలంటే మానసికంగా శారీరకంగా సుద్రుడమైన యువతతోనే సాధ్యమని, అందుకోసం యువత డ్రగ్స్ లాంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని అప్పుడే నషాముక్తు భారత్ సాధ్యమవుతుందని పట్లోళ్ల చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. మంగళవారం నేడు జడ్.పి.హెచ్.ఎస్ నారాయణఖేడ్ పాఠశాలలో బ్రహ్మకుమారి సమాజం ఆధ్వర్యంలో నషాముక్తు కార్యక్రమంలో వారు మాట్లాడుతూ సమాజాన్ని పట్టిపీడిస్తున్న డ్రగ్స్ మాఫియా, మత్తు పదార్థాలు సోషల్ మీడియా నుండి విద్యార్థులు దూరంగా ఉండి తమ తల్లిదండ్రుల ఆశయం నెరవేర్చుకోవాలన్నారు. తమ లక్ష్యసాధన కోసం విద్యార్థులు నిరంతరం విద్యా అధ్యయనం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇంచార్జి హెచ్ఎం యాదగిరి, ఉపాధ్యాయులు రాజశేఖర్, లక్ష్మణరావు చంద్రశేఖర్ ఆచార్య, ధన్సింగ్, హమీద్, బ్రహ్మకుమారి సమాజం సభ్యులు లక్ష్మీదీది, రామచంద్ర రావు తదితరులు పాల్గొన్నారు.

# బైక్‌పై నుంచి పడి యువకుడికి తీవ్ర గాయం




**హైదరాబాద్ పల్స్ న్యూస్ మార్చి 31, మహబూబాబాద్ ప్రతినిధి :**
మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం వెన్నారం గ్రామానికి చెందిన కొప్పుల సతీష్ మంగళవారం ప్రమాదానికి గురయ్యాడు. ఉయ్యాలవాడ గ్రామం నుండి వెన్నారం గ్రామానికి వస్తున్న క్రమంలో బైక్‌పై నుంచి జారి పడడంతో సతీష్ కుడి కాలుకు తీవ్ర గాయం అయింది.ఈ ఘటనను గమనించిన స్థానికులు వెంటనే స్పందించి 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న డోర్నకల్ 108 సిబ్బంది హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకుని బాధితుడికి ప్రథమ చికిత్స అందించారు. ఈఎంఎటీ లింగంపల్లి శ్రీనివాస్, పైలట్ ఎన్. ప్రశాంత్ సేవలతో గాయపడిన సతీష్‌ను ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయనకు చికిత్స కొనసాగుతోంది.

## బలపాల గ్రామంలో సిఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమం



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చి 31, మహబూబాబాద్ ప్రతినిధి :** కురవి మండలం బలపాల గ్రామంలో సిఎంఆర్ఎఫ్ లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ కార్యక్రమం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ రామచంద్రనాయక్ ఆదేశాల మేరకు గ్రామ సర్పంచ్ బాదావత్ బిక్కు నాయక్ లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ బిక్కు నాయక్, మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందన్నారు. ముఖ్యంగా ఆరోగ్యశ్రీ పథకం పరిధిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచడం ద్వారా పేద ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నట్లు తెలిపారు. అన్ని వర్గాల అభివృద్ధి కోసం ప్రభుత్వం నిబద్ధతతో పనిచేస్తోందని, ఎలాంటి భేదాభిప్రాయాలు లేకుండా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు.ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, "సకల జనుల ప్రజాహితం - ప్రజా ప్రభుత్వం" అనే నినాదంతో ముందుకు సాగుతున్నామని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో కురవి మండల కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ అధ్యక్షుడు అంబటి వెంకటనారాయణతో పాటు ఇతర నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## తెలంగాణా గ్రామాలకు కేంద్రం అదిరిపోయే శుభవార్త.. రూ.247.9 కోట్ల విడుదల



**హైదరాబాద్ పల్స్ న్యూస్ మార్చ్ 31, న్యూఢిల్లీ:** తెలంగాణ రాష్ట్రానికి కేంద్రం శుభవార్త చెప్పింది. 15వ ఆర్థిక సంఘం సిఫార్సుల మేరకు తెలంగాణ సహా ఆరు రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం 1500 కోట్ల రూపాయలకు పైగా గ్రాంట్ లను విడుదల చేసింది. ఇక తెలంగాణ రాష్ట్రానికి ఈ సందర్భంగా కేంద్రం తీపి కబురు చెప్పింది.తెలంగాణాకు 247.9 కోట్ల నిధులను విడుదల చేసిన కేంద్రం 15వ ఆర్థిక సంఘం సిఫార్సుల మేరకు రాష్ట్రంలోని పంచాయతీరాజ్ సంస్థల బలోపేతానికి 247.9 కోట్ల రూపాయల నిధులను విడుదల చేస్తూ కేంద్ర పంచాయతీ రాజ్ మంత్రిత్వశాఖ కీలక ఉత్తర్వులను జారీ చేసింది. రాష్ట్రంలోని 12 వేల 600 గ్రామ పంచాయతీల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం నిధులను విడుదల చేయడంతో తెలంగాణ రాష్ట్రంలోని గ్రామపంచాయతీల అభివృద్ధి త్వరితగతిన జరగడానికి అవకాశం ఉంటుందన్న అభిప్రాయం వ్యక్తం అయింది.

**అన్‌టైడ్ గ్రాంట్స్ నుంచి నిధులు:**
2025-26 ఆర్థిక సంవత్సరానికి నిర్దిష్ట వినియోగ నిబంధనలు లేని నిధులు- అన్‌టైడ్ గ్రాంట్స్ నుంచి 247.94 కోట్ల రూపాయలు కేంద్రం మంజూరు చేసింది. 2025- 26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మొదటి విడత అన్ టైడ్ గ్రాండ్స్ కింద ఈ నిధులను కేటాయించింది. దేశవ్యాప్తంగా ఆరు రాష్ట్రాలకు కలిపి మొత్తం 1500 కోట్లకు పైగా నిధులు మంజూరు చేయగా, అందులో తెలంగాణకు ప్రత్యేక ప్రాధాన్యత లభించినట్టు స్పష్టంగా కనిపిస్తుంది.

**గ్రామాలలో మౌలిక సదుపాయాల కల్పన:**
ఈ నిధులతో పల్లెల్లో మౌలిక సదుపాయాల కల్పన, స్థానిక అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపట్టేందుకు మార్గం సుగమమైంది. క్షేత్రస్థాయిలో పాలనను మరింత పారదర్శకంగా, వేగవంతంగా మార్చేందుకు ఈ నిధులు ఎంతగానో దోహదపడతాయని అధికారులు భావిస్తున్నారు.స్థానిక అవసరాలకు అనుగుణంగా గ్రామసభలు నిర్ణయించిన గ్రామాల పరిధిలోని వివిధ పనులకు ఈ నిధులను ఖర్చు చేసే వెసులుబాటు ఉంటుంది.

**గ్రామాలలో ముఖ్యంగా చేసే పనులు ఇవే:**
ముఖ్యంగా గ్రామాలలో అంతర్గత రోడ్ల నిర్మాణం, మురికినీటి కాలువల మరమ్మత్తులు, వీధి దీపాలను ఏర్పాటు చేయడం, స్మశాన వాటికల నిర్వహణ వంటి మౌలిక సదుపాయాల కల్పనకు ఈ నిధులను ఉపయోగించనున్నారు. పల్లె సీమలే దేశానికి పట్టు కొమ్మలు కావటంతో గ్రామాల ప్రగతి రాష్ట్ర ప్రగతికి, దేశ ప్రగతికి దోహదం చేస్తుంది.

### ఐఎన్టీయూసీ మిత్రపక్షాల ఆధ్వర్యంలో

## ఐటిసి అడ్మిన్ బ్లాక్ ఎదుట కార్మికుల నిరసన

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చి 31, భద్రాద్రి జిల్లా ప్రతినిధి :** బూర్గంపహాడ్ మండలం లో పరిధిలో గల సారపాక గ్రామం లో ఐటీసీ కర్మాగారంలో మంగళవారం నాడు ఐఎన్టీయూసీ మిత్రపక్షాల ఆధ్వర్యంలో 13వ వేతన ఒప్పందం కాలం నిన్నటితో ముగుస్తున్న నేపథ్యంలో జరగబోవు వేతన ఒప్పందం కార్మికులకు ఆమోద్యకరముగా ఉండాలని లక్ష్యంతో ఐటీసీ పిఎస్పీడీపీ కర్మాగారంలో 14వ వేతన ఒప్పందంలో 22000 వేల రూపాయలు ప్యాకేజీతో పాటు వేతనంతో కూడిన 100% మెడికల్. మరియు 12 లక్షల రిటర్మెంట్ బెనిఫిట్ సాధించాలని. 12 ఒప్పందంలో రాసిన విధంగా బదిలీ కార్మికులకు సీనియార్టీ ప్రకారం పర్మినెంట్ విధానం చేపట్టాలని చెబుతూ 13వ వేతన ఒప్పందం పెండింగ్ సమస్యలపై నిరసిస్తూ కార్మికులు భారీ సంఖ్యలో ధర్నా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఐఎన్టి యుసి అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు గోనె రామారావు, యారం పిచ్చిరెడ్డి మాట్లాడుతూ మరి నేటితో 13వ వేతన ఒప్పంద కాలం పూర్తి కావస్తున్నప్పటికీ రాసుకున్న వేతన ఒప్పందం సమస్యలు నేటికీ పూర్తి కాలేదని అదేవిధంగా 14వ వేతన ఒప్పందం చర్చలు ప్రారంభించి ఐదు నెలలు కావొస్తుందన్నారు అదేవిధంగా 13వ వేతన ఒప్పందాన్ని ఇన్ టైం అగ్రిమెంట్ అని చెప్పి ప్రస్తుత గుర్తింపు కార్మిక సంఘం 13 వేతన ఒప్పందంలో రాసుకున్న సమస్యలు ఇప్పటికీ పరిష్కరించకపోవటానికి వారి అసమర్ధకు నిదర్శనం అన్నారు 14వ వేతన ఒప్పందంలో 22,000 ప్యాకేజీకి ఏమాత్రం




తగ్గకుండా 100% మెడికల్ సాధించాలని కోరుతూ ఐటిసి అడ్మిన్ బ్లాక్స్థ ముందు కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని గుర్తింపు సంఘానికి, యాజమాన్యానికి వ్యతిరేకంగా భారీ నినామాలతో నిరసన తెలియజేశారు. మెడికల్ విషయంలో ఏ మాత్రం తేడాలు వచ్చినా తదనంతరం కార్మికులు కార్మికులు తీసుకునే నిర్ణయాలకు యాజమాన్యం పూర్తిత బాధ్యత వహించాల్సి వస్తుంది అన్నారు అదేవిధంగా రాసుకున్న ఎన్నో సమస్యలు పెండింగ్లో ఉన్నాయని, అవన్నీ త్వరితగతంగా పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల నివాసానికి నూతన క్వార్టర్స్ నిర్మాణం, కాంట్రాక్ట్ కార్మికులకు స్కిల్ మాట్రిక్స్ ఇలా పెండింగ్ సమస్యలు చాలా ఉన్నాయని, త్వరగా పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. మొత్తం 30 అంశాలపై నినాదాలు చేస్తూ అధిక సంఖ్యలో కార్మికులు. కార్మిక నాయకులు కార్యవర్గ సభ్యులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

## నాబార్డ్ వాటర్ షెడ్ ప్రాజెక్ట్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే డా. పి.సంజీవరెడ్డి

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చ్ 31, నారాయణఖేడ్ :** సిర్గాపూర్ మండల పరిధిలోని వసర్ గ్రామంలో నాబార్డ్ (నాబార్డ్) సహకారంతో ఏర్పాటు చేసిన 'వసర్ వాటర్ షెడ్ ప్రాజెక్ట్' నూతన కార్యాలయ పనులను నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి మంగళవారం నాడు ఘనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... గ్రామీణ ప్రాంతాల్లో భూగర్భ జలాల పెంపునకు, వ్యవసాయ రంగానికి ఊతమివ్వడానికి వాటర్ షెడ్ ప్రాజెక్టులు ఎంతగానో దోహదపడతాయని అన్నారు. నాబార్డ్ ఆర్థిక సహాయంతో చేపడుతున్న ఈ ప్రాజెక్ట్ ద్వారా వసర్ మరియు పరిసర ప్రాంతాల రైతులకు ఎంతో మేలు జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యాలయం ద్వారా వాటర్ షెడ్ పనులను నిరంతరం పర్యవేక్షిస్తూ, రైతులకు అవసరమైన సాంకేతిక సలహాలు మరియు సహాయం అందిస్తామని తెలిపారు. రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి మరియు రైతాంగ సంక్షేమానికి తాము ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో



స్థానిక ప్రజాప్రతినిధులు, నాబార్డ్ అధికారులు, నా బార్డ్ దండం కృష్ణ తేజ, ఆర్ ఓ రాధ రాణి, ఏ డి ఏ నూతన్ కుమార్, యన్ జి ఓ చంద్ర శేఖర్, హన్మంత్ గ్రామ సర్పంచ్, విఠల్ రెడ్డి ఉప సర్పంచ్, వివిధ శాఖల నాయకులు, కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

## రైతులు యాసంగి పంటకు ధాన్యం, ప్రతి గింజలు కొనుగోలు చేయాలి

### జిల్లా కలెక్టర్ అంకిత్

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చి 31, భద్రాద్రి జిల్లా ప్రతినిధి :** యాసంగి ధాన్యం కొనుగోలు ప్రక్రియను పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహిస్తూ రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఐడిఓసి సమావేశ మందిరంలో జిల్లా పౌర సరఫరాల సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ తో కలసి కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జ్‌లు, వ్యవసాయ, సహకార, డీఆర్‌డీఏ, తూనికలు - కొలతలు, రవాణా మార్కెటింగ్ శాఖ అధికారులు, సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 1,87,309 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి అంచనా ఉన్నదని, అందులో సన్న రకం 1,35,365 మెట్రిక్ టన్నులు, దొడ్డు రకం 51,944 మెట్రిక్ టన్నులు ఉన్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో 168 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని, అవసరాన్ని బట్టి అదనపు కేంద్రాలు కూడా ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు ప్రభుత్వం ధాన్యాన్ని ఏ, బి గ్రేడ్‌లుగా విభజించి మద్దతు ధరలు నిర్ణయించినట్లు తెలిపారు. ఏ గ్రేడ్ ధాన్యానికి రూ. 2389, బి గ్రేడ్‌కు రూ. 2369 ధరలు నిర్ణయించగా, సన్న రకం వడ్లకు అదనంగా రూ. 500 బోనస్ ఇవ్వబడుతుందని వెల్లడించారు.ఈ సంవత్సరం ఉష్ణోగ్రతలు అధికంగా ఉండే అవకాశం ఉన్నందున కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు, హమాలీలు ఎండబారకుండా టెంట్లు, షెడ్ నెట్‌లు, చలువ పందిళ్లు ఏర్పాటు చేసి తగిన నీడ కల్పించాలని సూచించారు. తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో రద్దీ నియంత్రణ కోసం క్రాప్ బుకింగ్ ఆధారంగా రైతులకు టోకెన్లు జారీ చేయాలని, అవసరమైన ఏర్పాట్లపై చెక్‌లిస్ట్ జారీ చేసి, దాని ప్రకారం చర్యలు తీసుకొని ధృవీకరణ నివేదికలు సమర్పించాలని సూచించారు. సరిహద్దు రాష్ట్రాల నుండి అక్రమంగా ధాన్యం




రాకుండా జిల్లాలో చెక్‌పోస్టుల ద్వారా పటిష్ట నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని అదే రోజు ఆన్‌లైన్ నమోదు చేసి రైస్ మిల్లులకు తరలించాలని, రవాణాలో జాప్యం జరగకుండా మిల్లర్లు చర్యలు తీసుకోవాలని చెప్పారు.ధాన్యం విక్రయాలపై రైతులకు విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. నాణ్యతా ప్రమాణాలు పాటిస్తే రైతులకు మెరుగైన ధర లభిస్తుందని, రైతులను సన్నద్ధం చేయాలని సూచించారు. తరుగు పేరుతో రైతులను ఇబ్బందులకు గురి చేస్తే సంబంధిత సెంటర్ ఇన్‌చార్జ్‌లు, మిల్లర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు ధాన్యం విక్రయానికి వచ్చినప్పుడు ఆధార్ కార్డు, బ్యాంక్ వివరాలు, పట్టాదారు పాస్‌బుక్ జిరాక్స్ వెంట తీసుకురావాలని సూచించారు. ఆధార్‌కు లింక్ అయిన మొబైల్ నెంబర్‌కు వచ్చే ఓటీపీ ద్వారా రిజిస్ట్రేషన్ జరుగుతుందని తెలిపారు. గన్నీ సంచులు సరిపడా నిల్వలో ఉంచి, ఆన్‌లైన్ నమోదు చేసిన రైతులకు మాత్రమే ఇవ్వాలని, వాటి వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేయాలని సూచించారు.కొనుగోలు కేంద్రాల్లో టార్పాలిన్లు, మాయిశ్చర్ మీటర్లు సిద్ధంగా ఉంచాలని, బ్యానర్ల ద్వారా మద్దతు ధరలు, నాణ్యతా ప్రమాణాలు, అధికారుల సంప్రదింపు వివరాలు స్పష్టంగా ప్రదర్శించాలని ఆదేశించారు. సన్న వడ్లు, దొడ్డు వడ్లకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ధాన్యం కొనుగోలు సమయంలో ఐరిస్ స్కానర్ ద్వారా మాత్రమే ప్రక్రియ పూర్తి అవుతుందని, డేటా ఎంట్రీ సమయంలో రైతు తప్పనిసరిగా హాజరుగా ఉండాలని తెలిపారు. తూకపు పరికరాలను తనిఖీ చేసి సీల్స్ వేయాలని సూచించారు.అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ధాన్యం కొనుగోలు ప్రక్రియను విజయవంతం చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, కొత్తగూడెం ఆర్ డి ఓ మధు,పౌర సరఫరాల సంస్థ మేనేజర్ త్రినాధ్ బాబు, పౌర సరఫరాల అధికారి ప్రేమ్ కుమార్, వ్యవసాయ అధికారి బాబురావు, తూనికలు - కొలతల అధికారి మనోహర్, మార్కెటింగ్ అధికారి నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

### నారాయణఖేడ్ మున్సిపల్ బడ్జెట్

## సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్మన్

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చ్ 31, నారాయణఖేడ్ :** నారాయణఖేడ్ పురపాలక సంఘం నారాయణఖేడ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన బడ్జెట్ ప్రత్యేక సమావేశంలో నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి నారాయణఖేడ్ మున్సిపల్ చైర్మన్ నగేష్ కుమార్ శేట్కర్ పాల్గొన్నారు. ఈ సమావేశంలో 2026-2027 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వార్షిక అంచనా బడ్జెట్‌ను, అలాగే 2025-2026 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన సవరించిన బడ్జెట్ అంచనాలను ప్రవేశపెట్టి ఆమోదించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...నారాయణఖేడ్ పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ఈ బడ్జెట్ రూపొందించబడిందని అన్నారు.ప్రజా సమస్యల పరిష్కారానికి, మౌలిక వసతుల కల్పనకు బడ్జెట్‌లో ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు, కౌన్సిలర్లకు సూచించారు. వార్డుల వారీగా అవసరాలను గుర్తించి నిధులను పారదర్శకంగా వినియోగించాలని, నారాయణఖేడ్‌ను ఆదర్శవంతమైన మున్సిపాలిటీగా తీర్చిదిద్దడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వారితోపాటు మున్సిపల్ వైస్ చైర్మన్ దారం శంకర్ సెట్,బాణాపురం రాజు, రుక్మిణి గోపాల్ రెడ్డి, మహేష్ చౌహన్, సురేఖ విట్టల్, సుబుర్, మైతాబ్, వివేకనంద, లక్ష్మణ్, విజయ్ బుజ్జి, అభిషేక్ శేట్కర్, ముజీబ్, రామ కృష్ణ,




ప్రజాప్రతినిధులు తదితర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# ఆదాయం గోరంత ఖర్చు కొండంత

**రూ.140 కోట్లతో అంచనాలు అంకెల గారడీ బడ్జెట్**
**నగర వాసులకు ప్రయోజనం శూన్యం**
**60 డివిజన్లకు 96మంది స్వచ్ఛ ఆటో డ్రైవర్లు ఎందుకు..?**
**పారిశుధ్య కార్మికుల వేతనాల్లో వ్యత్యాసం దేనికి..?**
**బడ్జెట్ ప్రవేశ పెట్టిన తీరు నిబంధనలకు విరుద్ధం..**
**కొత్తగూడెం మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ కాపు సీతాలక్ష్మి**



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చి 31, భద్రాద్రి జిల్లా ప్రతినిధి :**
కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ రూ.140 కోట్ల అంచనాతో ప్రవేశపెట్టిన 2026-27 వార్షిక బడ్జెట్ అంకెల గారడీతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నమని, నగర వాసులకు ఒరిగేదేమీ లేదని మున్సిపల్ మాజీ చైర్పర్సన్ కాపు సీతాలక్ష్మి తీవ్రంగా విమర్శించారు. సోమవారం మేయర్ గణేష్ అధ్యక్షతన కార్పొరేషన్ కార్యాలయంలో తొలిసారి నిర్వహించిన బడ్జెట్ సమావేశంపై ఆమె ధ్వజమెత్తారు. కాగితాలకే పరిమితమైన ఈ బడ్జెట్ కార్యరూపం దాల్చడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నగర అభివృద్ధికి అవసరమైన నిధులను సమకూర్చడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు.ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 107 కోట్ల నిధులు వస్తాయని అంచనా వేస్తూ, 140 కోట్లతో బడ్జెట్ రూపొందించడం ప్రజలను తప్పుదోవ పట్టించే చర్య అని విమర్శించారు. ఈ నిధులు ఎలా సమకూరుతాయో స్పష్టత లేకపోవడం బడ్జెట్‌లో పెద్ద లోపమని పేర్కొన్నారు. కార్పొరేషన్‌లో ఆదాయం కేవలం రూ.33కోట్లు ఉందని, ఆదాయం పెంచే విధంగా ప్రణాళిక లేకుండా ప్రభుత్వ నిధులపై అంచనాలతో గారడి చేయడం సరికాదని, మున్సిపల్ ఆదాయ వనరుల్లో కీలకమైన ఆస్తిపన్ను బకాయిలను కనీసం 70 శాతం వసూలు చేసి ఖజానాలో జమ చేస్తేనే గ్రాంట్లు అందే అవకాశం ఉందని గుర్తు చేశారు. అయితే ఈ అంశంలో నిర్లక్ష్యం కారణంగా నగరానికి రావాల్సిన నిధులు కూడా అందకపోతున్నాయని అన్నారు. అలాగే ఎన్నికల్లో కార్పొరేటర్లు ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కదానికి సరైన నిధుల కేటాయింపులు లేవని, కోతులు, కుక్కల సమస్యల పరిష్కారానికి సరైన ప్రణాళిక లేదని, కనీసం ఈ ప్రధాన సమస్యపై సమావేశంలో అంశాన్ని కూడా చేర్చలేదని విమర్శించారు. అలాగే సమావేశంలో ప్రవేశపెట్టిన 16, 17, 18, 19 అంశాలు ఎవరికి ప్రయోజనం కోసమని ప్రశ్నించారు.బడ్జెట్ ప్రవేశ పెట్టిన తీరు నిబంధనలకు విరుద్ధం మున్సిపల్ కార్పొరేషన్ నిబంధనల ప్రకారం వరుసగా మూడు వర్కింగ్ రోజుల్లో మాత్రమే బడ్జెట్ సమావేశం నిర్వహించాలని, కానీ ఒక రోజు ఆదివారం కాగా, సోమవారం వర్కింగ్ డే, మంగళవారం మహవీర్ జయంతి సందర్భంగా ఆప్షనల్ హాలిడే ఉండగా, సమావేశం ఎలా నిర్వహిస్తారని, ఇది ఖచ్చితంగా నిబంధనలకు విరుద్ధమన్నారు. హడావుడిగా బడ్జెట్ సమావేశం పెట్టడం వెనుక ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. పారిశుధ్య కార్మికుల వేతనాల్లో వ్యత్యాసం దేనికి..?కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్‌లో పాల్వంచ, కొత్తగూడెం, సుజాతనగర్ కలిపి 341 మంది పారిశుధ్య కార్మికులు పనిచేస్తున్నారని, వారిలో పాల్వంచలో పనిచేస్తున్న 137 మందిలో 133మందికి 20,460 ఇస్తుండగా, కొత్తగూడెంలో 175మంది, సుజాతనగర్‌లో 29మంది పనిచేస్తుండగా, వారికి మాత్రం 19,298 వేతనాలు ఇవ్వడం దేనికి అని ప్రశ్నించారు. వారు అందరూ చేస్తున్న పని ఒక్కటే అయినప్పుడు పాల్వంచ వారికి ఎక్కువ, మిగతా ప్రాంతాల వారికి తక్కువగా ఇవ్వడం వెనుక ఉన్న మతలబు ఏమిటో వివరించాలని ప్రశ్నించారు. అదే విధంగా 60 డివిజన్లు ఉన్న కార్పొరేషన్‌లో 96 మంది స్వచ్ఛ ఆటో డ్రైవర్లు ఎందుకని, అదనపు సిబ్బంది పేరిట నిధుల దుర్వినియోగం చేస్తూ ఎవరి ఖాతాలో వేస్తున్నారో బహిరంగంగా చెప్పాలని డిమాండ్ చేశారు.అదేవిధంగా కార్యాలయ ఖర్చులు, ఉద్యోగుల జీతభత్యాలు, ఇతర వ్యయాలను దృష్టిలో ఉంచుకుని రూపొందించిన ఈ బడ్జెట్‌లో "సమాన పనికి సమాన వేతనం" అమలు చేస్తే, పాలక ప్రభుత్వాల నుంచి సరైన మద్దతు లేకపోతే ఆర్థిక భారాన్ని తట్టుకోవడం కష్టమని పేర్కొన్నారు. మొత్తంగా ఈ బడ్జెట్ నగర వాసుల ఆశలను నెరవేర్చే విధంగా లేకపోవడం బాధాకరమని, ప్రజల అవసరాలకు అనుగుణంగా పారదర్శకంగా నిధుల వినియోగం జరగాలని కాపు సీతాలక్ష్మి డిమాండ్ చేశారు.

# ఏప్రిల్ 7న ఉద్యమకారుల విస్తృత స్థాయి సమావేశం

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చి 31, మహబూబాబాద్ ప్రతినిధి :**
డోర్నకల్ పట్టణంలో ఉన్న అశోక్ భవనంలో ఏప్రిల్ 7వ తేదీన డోర్నకల్ నియోజకవర్గ ఉద్యమకారుల విస్తృత స్థాయి సమావేశాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు మహబూబాబాద్ జిల్లా ఉద్యమకారుల యూత్ అధ్యక్షుడు తుపాకుల రామచంద్రర్, డోర్నకల్ మండల ఉద్యమకారుల ప్రధాన కార్యదర్శి కోదాటి వెంకన్న, మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో స్పష్టంచేశారు. ఈ సమావేశం ఉద్యమకారుల ఐక్యతను మరింత బలపరచడమే లక్ష్యంగా నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. తెలంగాణ ఉద్యమకారుల ఆత్మగౌరవాన్ని ప్రతిబింబించే ఈ ముఖ్యమైన సభకు పలువురు ప్రముఖ నాయకులు హాజరుకానున్నారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ విజయశాంతి, తెలంగాణ ఉద్యమకారుల ఫోరం చైర్మన్ సీమ శ్రీనివాస్, రాష్ట్ర ఉద్యమకారుల వర్కింగ్ ప్రెసిడెంట్ నందగిరి రజినీకాంత్, మండల అధ్యక్షుడు ఆజ్మీర పరశ నాయక్, ప్రధాన కార్యదర్శి సంద్రగిరి కృష్ణ మూర్తి, టౌన్ అధ్యక్షుడు మామిడి నాగరాజు, మహబూబాబాద్ జిల్లా ఉద్యమకారుల ఉపాధ్యక్షుడు మేకల రామారావు తదితర ప్రముఖులు పాల్గొని సభను ఉద్దేశించి ప్రసంగించనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. ఈ సమావేశం ద్వారా ఉద్యమకారుల సమస్యలు, భవిష్యత్ కార్యాచరణపై చర్చించడంతో పాటు ఉద్యమానికి కొత్త దిశ నిర్దేశం చేయనున్నట్లు తెలిపారు. డోర్నకల్ నియోజకవర్గంలోని అన్ని మండలాల నుండి



ఉద్యమకారులు భారీ సంఖ్యలో హాజరై సభను విజయవంతం చేయాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశం ఉద్యమకారుల ఐక్యతకు ప్రతీకగా నిలవనుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.

# కావేటి సమ్మయ్య చౌరస్తాగా నామకరణానికి తీర్మాణం

**హర్షం వ్యక్తంచేస్తున్న కాగజ్ నగర్ ప్రజలు**
**ఉద్యమకారునికి దక్కిన గౌరవం**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చ్ 31, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:**
కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్ పట్టణంలోని భట్టుపల్లి చౌరస్తాకు సిర్పూరు మాజీ ఎమ్మెల్యే కావేటి సమ్మయ్య చౌరస్తాగా నామకరణం చేస్తూ మంగళవారం మున్సిపల్ కౌన్సిల్ ఏకగ్రీవంగా తీర్మాణించింది. వార్డు నెంబర్ 6, 7ల పరిధిలో ఉన్న ఈ చౌరస్తాకు తన తండ్రి. మాజీ ఎమ్మెల్యే కావేటి సమ్మయ్య చౌరస్తాగా నామకరణం చేయాలని వార్డు నెం. 17 కౌన్సిలర్ కావేటి విజయ్ కుమార్ కోరిన నేపథ్యంలో దీనికి నామకరణం చేస్తూ కౌన్సిల్ తీర్మాణించింది. కావేటి సమ్మయ్య విగ్రహాన్ని కూడా ఆ చౌరస్తాలో నెలకొల్పాలని పలువురు కౌన్సిలర్లు చేసిన సూచన మేరకు విగ్రహం ఏర్పాటుకు కూడా కౌన్సిల్ ఆమోదం తెలిపింది. మలి విడత తెలంగాణ ఉద్యమంలో కావేటి సమ్మయ్య పాత్ర ఎనలేనిది. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం సిర్పూరు నియోజకవర్గంలో ఆయన చేసిన ఉద్యమాలు ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు ప్రాముఖ్యతను తెలిపాయ'ని ఉమ్మడి ఆదిలాబాద్ ఎమ్మెల్సీ దండె విఠల్ అన్నారు. మంగళవారం జరిగిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో భట్టు పెల్లి చౌరస్తాకు కావేటి సమ్మయ్య చౌరస్తాగా నామకరణం చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఉద్యమంలో భాగంగా కావేటి సమ్మయ్య నల్ల టీ షర్టు ధరించి అసెంబ్లీ పైకి ఎక్కి చేసిన నిరసన రాష్ట్ర ఉద్యమాన్ని ప్రభావితం చేసిందన్నారు. అటువంటి ఉద్యమకారునికి గత బీఆర్ఎస్ ప్రభుత్వం విలువ ఇవ్వలేదని, ప్రస్తుతం మా (కాంగ్రెస్) ప్రభుత్వం గుర్తించి ఆయనకు సముచిత గౌరవాన్ని కల్పించిందన్నారు.
**కౌన్సిల్ సభ్యులకు ధన్యవాదాలు:**కావేటి విజయ్ కుమార్, 17వ వార్డు కౌన్సిలర్. తన తండ్రి కీ. శే. కావేటి సమ్మయ్య పేరును భట్టుపెల్లి చౌరస్తాకు నామకరణం చేయడం సంతోషకరమని 17వ వార్డు కౌన్సిలర్ కావేటి విజయ్ కుమార్ అన్నారు. తన కోరికతో మంగళవారం జరిగిన సమావేశంలో దీనిని ఏకగ్రీవంగా ఆమోదించిన తోటి కౌన్సిలర్లకు, ఇందుకు సహకరించిన మున్సిపల్ అధికారులకు ధన్యవాదాలు తెలుపుతున్నానని కావేటి విజయ్ కుమార్ అన్నారు.



# రాష్ట్ర ప్రభుత్వం వెంటనే వరి ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

**సిపిఎం పార్టీ మండల కార్యదర్శి వేముల బిక్షం**

హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చి 31, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి : ఆత్మకూరు మండలం పరిధిలో ఉన్న తుక్కాపురం గ్రామంలో ఐకెపి సెంటర్ లో ఉన్న వరి ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలన్నారు. సిపిఎం పార్టీ మండల కార్యదర్శి వేముల బిక్షం ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు పండించిన వరి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని సహకార సంఘాల ఐకెపి కేంద్రాలు ఆధ్వర్యంలో నిర్వహించే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం వెంటనే ప్రారంభించాలని సిపిఎం మండల కార్యదర్శి వేముల బిక్షం డిమాండ్ చేశారు. మంగళవారం సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ధాన్యా రాశులను పరిశీలించారు రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన వరి పంట చేతికి వచ్చి వరి కోతలు ప్రారంభమైనప్పటికీ ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించడంలో కాలయాపన చేస్తున్నారు. రైతులు ప్రైవేటు వ్యాపారుల చేతిలో నష్టపోకుండా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు మద్దతు ధరకు ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అవనగంటి సోమయ్య సురేందర్ రెడ్డి, ఏపూరి మధు శ్రీశైలం, ఎం.కాంతి కుమార్, నరేష్, అచ్చయ్య, ఏపూరి బుగ్గ రాములు, మారుపాక అంజయ్య, మారుపాక నాగమ్మ, మారుపాక పద్మ, ఎస్సార్ నరసింహ చారి, మారుపాక



కిష్టయ్య, సంఘపాక దేవదాస్, పి.వెంకటేశ్వర్లు, సత్తయ్య, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

# బొడ్రాయి తండాలో దారుణం... మహిళపై దాడి



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చి 31, మహబూబాబాద్ ప్రతినిధి :**
మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం బొడ్రాయి తండా గ్రామంలో పాత కక్షల నేపథ్యంలో ఘోర ఘటన చోటుచేసుకుంది. సోమవారం నాడు ఉదయం వ్యవసాయ పనుల్లో నిమగ్నమై ఉన్న తేజవత్ భారతి పై ఇద్దరు వ్యక్తులు రాళ్లు, కర్రలతో దాడి చేశారు. ఈ దాడిలో తేజవత్ భారతి తీవ్రంగా గాయపడగా, తలపై తీవ్ర గాయాలతో పాటు వెంట్రుకలు ఊడిపోయినట్లు స్థానికులు తెలిపారు. దాడి చేసిన వారిగా తేజవత్, అచ్చాలి, జగదీష్, గుర్తించారు. ఈ దాడి పక్కా ప్రణాళిక ప్రకారం జరిగినదని బాధితురాలు భారతి కుటుంబం సభ్యులు ఆరోపించారు. ఈ దాడిలో బారతి బంగారం పుస్తెల తాడు మూడు తులాలు, చేవు దిద్దులు ఒక తులం, కాళ్ల వెండి పట్టీలు 20 తులాలు తీసుకున్నారని తీవ్రంగా గాయపడిన భారతి ను స్థానికులు వెంటనే 108 అంబులెన్స్ సహాయంతో ఖమ్మంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.ఈ ఘటనపై బాధిత మహిళ మీడియాతో మాట్లాడుతూ, తనపై దాడి చేసిన తెజవత్ అచ్చాలి, జగదీష్, పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వారి నుండి నాకు ప్రాణహాని ఉందని కన్నీటి పర్యంతమయ్యారు. గ్రామ ఉప సర్పంచ్ తేజవత్ జామ్లు వచ్చి నా పైన జరిగే దాడిని అడ్డుకున్నారని లేకుంటే నా ప్రాణాలు కోల్పోయేదానన్ని తెలిపారు. ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. గ్రామంలో ఈ సంఘటన కలకలం రేపగా, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని స్థానికులు కోరుతున్నారు.



# నిమ్జ్ భూములోకి అక్రమంగా చొరబడిన ఐదుగురిపై కేసు నమోదు




**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చ్ 31, న్యాల్కల్ :** మండలంలోని నిమ్జ్ పరిధిలో ఉన్న ప్రభుత్వ భూమిపై అక్రమ చొరబాటు ఘటన వెలుగులోకి వచ్చింది. భూమి సరిహద్దులను సూచించే బౌండరీ రాళ్లను ధ్వంసం చేసిన సంఘటనపై ఐదుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. మండల గిర్దావర్ తన విధుల్లో భాగంగా మంగళవారం ఉదయం 9 గంటల సమయంలో మండలంలోని రుక్మాపూర్, ముంగి తండా గ్రామాల శివారులోని సర్వే నంబర్లు 48/2, 48/12, 49, 148లో ఉన్న నిమ్జ్ భూమిని పరిశీలించారు. ఈ సందర్భంగా భూమి సరిహద్దుల వద్ద ఏర్పాటు చేసిన రాళ్లు ధ్వంసం చేయబడినట్లు గుర్తించారు. విచారణలో రుక్మాపూర్ తండాకు చెందిన చౌహన్ శంకర్, రాజు పుండలిక్, ముంగి తండాకు చెందిన బొజ్జ నాయక్, బర్దిపూర్ గ్రామానికి చెందిన తెలుగు శ్రీకాంత్ తదితరులు ఈ ఘటనలో పాల్గొన్నట్లు అధికారులు నిర్ధారించారు. ఇప్పటికే నిమ్జ్ భూమి సర్వే సమయంలో కూడా వీరు అవాంఛనీయంగా వ్యవహరించి న్యూసెన్స్ సృష్టించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో మండల తహసిల్దార్ హద్నూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు హద్నూర్ ఎస్సై దోమ సుజిత్ వెల్లడించారు

# ఇద్దరు పిల్లలను చంపి ఉరివేసుకున్న తల్లి.!.. బిగ్ ట్విస్ట్ బయటపెట్టిన పేరెంట్స్

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చ్ 31, కూకట్పల్లి :** భార్య భర్తల మధ్య గొడవలతో ఓ తల్లి తన ఇద్దరు కొడుకులను చంపి తాను ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన కూకట్పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. వరంగల్ జిల్లా చెన్నారావుపేట్, మాణిక్య తండా కు చెందిన బోడ ప్రవీణ్కు అదే మండలంలోని పదహారుచింత తండాకు చెందిన ఎస్. బానోత్ స్రవంతి (27)తో గత 13 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వీరికి బి. కార్తీక్ (10), కౌశిక్ (8) ఇద్దరు సంతానం. ప్రవీణ్, స్రవంతి కుటుంబం కూకట్పల్లిలోని కైత్లాపూర్ గ్రామం రాఘవేంద్ర సొసైటీ లో నివాసం ఉంటున్నారు. ప్రవీణ్ స్థానికంగా డ్రైవర్గా పని చేస్తుంటాడు. ఇదిలా ఉండగా మంగళవారం ఇంట్లో ఒంటరిగా ఉన్న స్రవంతి తన ఇద్దరు కొడుకులను చంపి తాను ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మధ్యాహ్నం ఇంటికి తిరిగి వచ్చిన ప్రవీణ్ తలుపు తట్టగా స్రవంతి ఎంతకు తెరవకపోవడంతో స్థానికుల సహాయంతో తలుపులు బద్దలు కొట్టి చూడగా స్రవంతి, ఇద్దరు కొడుకులు విగత జీవులుగా పడి ఉన్నారు. స్థానికులు అందించిన సమాచారం మేరకు కూకట్పల్లి పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. సంఘటన స్థలాన్ని ఏసీపీ నరేష్ రెడ్డి, సీఐ సుబ్బారావులు సందర్శించారు.

**బిగ్ ట్విస్ట్ బయటపెట్టిన పేరెంట్స్**



ఇదిలా ఉండగా ప్రవీణ్, స్రవంతి మధ్య తరచూ గొడవలు చోటు చేసుకుంటూ ఉండేవని, ప్రవీణ్ గత కొన్ని నెలల క్రితం సోనీ అనే మరో అమ్మాయిని వివాహం చేసుకోవడంతో ఇద్దరి మధ్య గొడవలు జరుగుతుండేవని, ఈ క్రమంలో రెండు రోజుల క్రితం స్రవంతి ప్రవీణ్తో కొట్లాడి తన పుట్టింటికి వెళ్లి పోయిందని, ప్రవీణ్ తన భార్యను మంచిగా చూసుకుంటానని పెద్దల సమక్షంలో చెప్పి తిరిగి తనతో పాటు తీసుకు వచ్చినట్టు పోలీసులు తెలిపారు. ఇదిలా ఉండగా స్రవంతిని ప్రవీణ్ హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నాడని, రెండో పెళ్లి చేసుకున్న ప్రవీణ్ స్రవంతిని అడ్డు తొలగించుకోవాలని పథకం ప్రకారం స్రవంతిని హత్య చేశాడని స్రవంతి సోదరి ఆరోపించారు. ఇదిలా ఉండగా పిల్లలను ఎలా చంపారు, గొంతు నులిమి చంపారా, లేదా విషం ఇచ్చారా అన్నది పోస్ట్ మార్టం తర్వాత తెలుస్తుందని ఏసీపీ నరేష్ రెడ్డి తెలిపారు. ఇదిలా ఉండగా స్రవంతిని భర్త ప్రవీణ్ హత్య చేశాడన్న ఆరోపణలతో ప్రవీణ్ సొంతూరు మాణిక్యతండాలోని ప్రవీణ్ ఇంటిని స్రవంతి కుటుంబ సభ్యులు తగలబెట్టారు. ప్రవీణ్ రెండో పెళ్లి చేసుకుని స్రవంతితో గొడవలు పడి అడ్డు తొలగించుకునేందుకు ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారని స్రవంతి తరపు బంధువులు ఆరోపిస్తున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని, మృతదేహాలను శవ పరీక్ష నిమిత్తం గాంధీకి తరలిస్తున్నట్టు ఏసీపీ నరేష్ రెడ్డి తెలిపారు.

# మద్యం బానిసనికి రోడ్డున పడుతున్న కుటుంబాలు

**మద్యం పై ఉక్కుపాదం అవసరం బెల్ట్ షాపులకు మద్యం తరలింపు అరికట్టాలి.**

**సమాచారహక్కు రక్షణ చట్టం జిల్లా సభ్యులు, నియోజకవర్గం ప్రధానకార్యదర్శి కుమ్మరి లింగయ్య.**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చి 31, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:**
కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో ప్రస్తుతం మద్యం బానిసత్వం రోజు రోజుకు పెరుగుతూ అనేక కుటుంబాలను రోడ్డున పడేస్తోందని సమాచారహక్కు రక్షణ చట్టం జిల్లా సభ్యులు, నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి కుమ్మరి లింగయ్య ఆందోళన వ్యక్తం చేశారు. మద్యం వ్యసనం కారణంగా కుటుంబాల్లో కలహాలు, ఆర్థిక ఇబ్బందులు, మహిళలు మరియు పిల్లలపై హింస పెరుగుతోందని ఆయన పేర్కొన్నారు. రోజువారీ కూలీలు సంపాదించిన డబ్బును మద్యం కోసం ఖర్చు చేస్తుండటంతో కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు.
ప్రత్యేకంగా గ్రామాలలోని కిరాణా షాపులలో, పాన్ టేలాలలో, తాండాలలో, అక్రమంగా నడుస్తున్న బెల్ట్ షాపులు మద్యం వినియోగాన్ని మరింత పెంచుతున్నాయని ఆయన ఆరోపించారు. ఈ బెల్ట్ షాపులకు తెల్లవారుజామున నుండే మద్యం సరఫరా జరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. అలాగే యువత మద్యం బానిసత్వానికి లోనవకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. సమాజంలో శాంతి భద్రతలు కాపాడాలంటే మద్యం పై ఉక్కుపాదం అవసరమని ఆయన స్పష్టం చేశారు. మద్యం మత్తులో విషాదకర ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. మద్యం మత్తులో పురుగుల మందు తాగిన ఘటనలు చోటుచేసుకుంటున్నాయని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం మరియు ఎక్సైజ్ శాఖ వెంటనే స్పందించి మద్యం పై కఠిన చర్యలు తీసుకోవాలని, అక్రమ బెల్ట్ షాపులను పూర్తిగా నిర్మూలించాలని డిమాండ్ చేశారు.



# అలనాటి జ్ఞాపకాలు నెమరు వేసిన విన్నకోట రమాకుమారి

**రాజపేట అనగానే గీతా జయంతి ఉత్సవాలు**
**50 సంవత్సరాల క్రితం కార్యక్రమాలపై ప్రశంసలు**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చి 31, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** రాజపేట మండల కేంద్రంలో 50 సంవత్సరాల క్రితం జరుగుతున్న గీతా జయంతి ఉత్సవాల్లో పాల్గొని హరికథ కాలక్షేపం చేసిన ఆంధ్ర ప్రదేశ్ తెనాలికి చెందిన విన్నకోట రమాకుమారి రాజపేట ను గుర్తుచేసి సంతోషంగా ఆప్యాయంగా మాట్లాడారు. హైదరాబాద్ లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఆమె త్యాగరాయ గాన సభలో జరిగిన అవార్డుల ప్రధాన ఉత్సవంలో అతిథిగా హాజరై రాజపేట కు చెందిన ప్రముఖ గాయని పబ్బోజు శోభారాణి తో ఆప్యాయంగా మాట్లాడారు. గ్లోబల్ ఫైనాన్స్ యోగ అకాడమీ వారు నిర్వహిస్తున్న కార్యక్రమంలో రాజపేటకు చెందిన పబ్బోజు శోభారాణి గ్లోబల్ నారీ సేవా శిరోమణి పురస్కారం అందుకున్న సమయంలో పలువురు సినీ, రాజకీయ నాయకులు విన్నకోట రమాకుమారి శోభారాణిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంలో శోభారాణి పరిచయం చేసుకుంటూ రాజపేట వాస్తవ్యురాలుగా చెప్పడంతో విన్నకోట రమాకుమారి ఎంతో సంతోషం వ్యక్తం చేసిందన్నారు. 50 సంవత్సరాల క్రితం కొనసాగుతున్న గీతా జయంతి ఉత్సవాల సందర్భంగా తాను హరికథలు చెప్పినట్లు ఆనందంగా చెప్పారు. 10 సంవత్సరాలకు పైగా రాజపేటలో జరిగే గీతా జయంతి ఉత్సవాల్లో పాల్గొని హరికథలు చెప్పానని గుర్తు చేస్తూ నిర్వహణ పూర్తి బాధ్యత చేపట్టిన ఉప్పల పెద్ద పోచయ్య ను విన్నకోట రమాకుమారి గుర్తు చేశారు. ఉప్పల పెద్ద పోచయ్య సేవలను కొనియాడారు. రాజపేట అంటే గీతా జయంతి ఉత్సవాలని ఆధ్యాత్మిక సేవ కార్యక్రమాలకు నెలవని ఆమె శోభారాణితో తెలిపారు. రాజపేట వారిని కలిసినప్పుడు తనకెంతో ఆనందం కలుగుతుందని ఆమె అన్నారు.



# టిజిఆర్టిసి బి.సి. ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ సమవేశంలో పాల్గొన్న ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చి 31, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** కుషాయిగూడలో తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ బి.సి. ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో సంస్థ కార్యకలాపాలు, బి.సి ఉద్యోగుల సమస్యలు, సంక్షేమ అంశాలపై విస్తృతంగా చర్చ జరిపారు. అలాగే కుషాయిగూడ డిపో నూతన కమిటీ పరిచయ కార్యక్రమం జరిగింది. డిపోలో పనిచేస్తున్న ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావిస్తూ అధికారులకు వినతి పత్రాన్ని మల్లన్న ఉద్యోగులతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర గౌరవ అధ్యక్షులు ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ బి.సి వర్గాల ఉద్యోగులు ప్రభుత్వ యంత్రాంగంలో కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. వారి హక్కుల పరిరక్షణ, ఉద్యోగ భద్రత, పదోన్నతులు, సంక్షేమ పథకాల అమలులో పారదర్శకత అవసరమని ఆయన స్పష్టం చేశారు. ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అలాగే కార్యక్రమంలో పదవి విరమణ పొందిన ఉద్యోగులను ప్రత్యేకంగా సన్మానించి, వారికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. వారు ఎన్నో సంవత్సరాల పాటు నిజాయితీగా సేవలు అందించి సంస్థ అభివృద్ధికి చేసిన కృషిని కొనియాడారు. ఈ సందర్భంగా రిటైర్డ్ ఉద్యోగులు కూడా మల్లన్న గారిపై అపారమైన అభిమానాన్ని వ్యక్తం చేశారు. బి.సి ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ చేస్తున్న సేవలను అభినందిస్తూ, ఉద్యోగుల ఐక్యతే వారి బలం అని, సంఘటితంగా ముందుకు సాగితే సమస్యలకు శాశ్వత పరిష్కారం సాధ్యమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర నాయకులు, వివిధ జిల్లాల ప్రతినిధులు, ఉద్యోగులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.



# హనుమాన్ జయంతి సందర్భంగా అవాంఛనీయ సంఘటనలు జరిగితే కఠిన చర్యలు

**జిల్లా ఎస్పీ నితిక పంత్**



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చ్ 31, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:**
కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన నెలవారీ నేర సమీక్షా సమావేశంలో జిల్లా ఎస్పీ నితిక పంత్ పోలీసులకు కీలక సూచనలు చేశారు. హనుమాన్ జయంతి సందర్భంగా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని, డయల్ 100 కాల్స్‌కు తక్షణ స్పందన ఇవ్వాలని ఆదేశించారు.గంజాయి, జూదం, మట్కా, బెట్టింగ్ వంటి అసాంఘిక కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకోవాలని, ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తుతో నేరస్తులకు శిక్ష పడేలా చూడాలని సూచించారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రాధాన్యత ఇవ్వాలని, సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు, మద్యం సేవించి వాహనాలు నడిపేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

# మహాలక్ష్మి పథకం మహిళలకు ఆర్థిక, సామాజిక బలం : కలెక్టర్ హరిత




**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చ్ 31, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:**
కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ ప్రాంగణంలో నిర్వహించిన మహాలక్ష్మి పథకం కార్యక్రమంలో కలెక్టర్ కె. హరిత ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడం ద్వారా జిల్లాలో ఇప్పటివరకు సుమారు రూ.77 కోట్లు ఆదా అయ్యాయని తెలిపారు. ఈ పథకం వల్ల చిన్న వ్యాపారాలు, రోజువారీ ఉపాధి చేసే మహిళలు ఆర్థికంగా బలపడుతూ, స్వయం ఆధారితంగా మారుతున్నారని చెప్పారు. గతంలో బయట పనుల కోసం ఇతరులపై ఆధారపడాల్సి వచ్చిన మహిళలు, ప్రస్తుతం స్వయంగా ప్రయాణించి పనులు పూర్తి చేసుకునే స్థాయికి చేరుకున్నారని పేర్కొన్నారు. ఈ పథకం మహిళల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచి, సామాజికంగా ముందుకు తీసుకెళ్తోందని తెలిపారు. ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమం ఇతర రాష్ట్రాలకు కూడా ఆదర్శంగా నిలుస్తోందన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు, సిబ్బంది, మహిళా ప్రయాణికులు పాల్గొన్నారు.



# పోలీస్ విధులకు అడ్డంకి.. ముగ్గురు అరెస్ట్

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చి 31, మహబూబాబాద్ ప్రతినిధి :**
బయ్యారం మండలంలో మార్చి 28, 2026న సంతులాల్ పోడు తండా గ్రామంలో పోలీస్ విధులను అడ్డుకునే ఘటన చోటుచేసుకుంది. ఈ ఘటనకు సంబంధించి గ్రామానికి చెందిన బానోత్ రవికుమార్, బానోత్ నవీన్ కుమార్, బానోత్ భాస్కర్ అనే ముగ్గురు వ్యక్తులను మంగళవారం బయ్యారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తమ చట్టపరమైన విధులు నిర్వహిస్తున్న సమయంలో ఈ ముగ్గురు అడ్డంకులు కల్పించినట్లు కేసు నమోదు చేశారు. అనంతరం వారిని అరెస్ట్ చేసి న్యాయస్థానంలో హాజరుపరచగా, కోర్టు ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించినట్లు బయ్యారం ఎస్సై కే. తిరుపతి తెలిపారు.ఈ సందర్భంగా ఎస్సై తిరుపతి మాట్లాడుతూ, పోలీస్ విధులకు ఆటంకం కలిగించడం చట్ట విరుద్ధమని స్పష్టం చేశారు. ఇలాంటి చర్యలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.


# కాగజ్‌నగర్ మున్సిపల్ కౌన్సిల్ శోభాయాత్రలు, జయంతులకు నిధులు మంజూరు



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చ్ 31, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:**
కాగజ్‌నగర్ మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో పలు కార్యక్రమాలకు నిధుల మంజూరుకు ఆమోదం లభించింది. ఏప్రిల్ 2న నిర్వహించనున్న హనుమాన్ శోభాయాత్రకు రూ.3 లక్షలు, అంబేద్కర్ జయంతికి రూ.2.56 లక్షలు, ఏప్రిల్ 4న జరగనున్న బాబు జగ్జీవన్ రామ్ జయంతికి రూ.1 లక్ష మంజూరు చేయాలని కౌన్సిల్ నిర్ణయించింది. ఈ మేరకు మున్సిపల్ కౌన్సిల్‌లో ప్రతిపాదనలు ఉంచగా, కౌన్సిల్ సభ్యులందరూ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. ఈ విషయాన్ని మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ డా. అనితతో పాటు బీఆర్ఎస్ కౌన్సిలర్లు వలి, విద్యావతి, బాబురావు, మాణిక్యం, వాసీమ్, రవి, గజ్జి స్వాతి, భాగ్యలక్ష్మి, పోచయ్య, స్వప్న వనమాల రాము, తదితరులు వెల్లడించారు.

# మూడు ఇండ్లలో చోరీ

**బుడిగె జంగాల కాలనీలో తాళాలు వేసిన ఇంట్లో సంఘటన**





**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చి 31, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** బ్రతుకుతెరువు నిమిత్తం కుటుంబ సభ్యులతో కలిసి ఇతర ప్రాంతాలకు వలస వెళ్లి తాళం వేసిన మూడు ఇండ్లలో దొంగతనాలు జరిగిన ఘటన మంగళవారం బయటపడింది. రాజపేట మండలం నమిల గ్రామం బుడిగ జంగాల కాలనీలో తాళం వేసి ఉన్న మూడు ఇండ్లలో చోరీ జరిగింది. బాధితులు మోతే నర్సింలు, వానరాశి సమ్మయ్య, మోతే చిన్న రాములు గ్రామస్తులకు తెలిపిన వివరాల ప్రకారం ఈ విధంగా ఉన్నాయి. బ్రతుకుతెరువు నిమిత్తం దాదాపు 45 రోజుల క్రితం ఇతర ప్రాంతాలకు వెళ్లిన ఆ మూడు కుటుంబాల ఇండ్లకు తాళం వేసి ఉండగా ఈ చోరీ జరిగింది. మోతే నర్సింలు ఇంట్లో 3వేల రూపాయల నగదు చోరీ కాగా బీరువాలోని వస్తువులు చిందర వందర చేశారు, వాన రాశి సమ్మయ్య ఇంట్లో 2 వేలు నగదు అపహరణకు గురైనట్లు, మోతే చిన్న రాములు ఇంట్లో నగలు నగదు లేకపోవడంతో ఏ వస్తువులు దొంగతనం కాలేదు. కిటికీ ఊచలు వెంటిలేటర్ ధ్వంసం చేసి ఇంట్లోకి దొంగలు చొరబడినట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది. బాధితుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ లింగారెడ్డి పోలీసులతో కలిసి సంఘటన స్థలానికి చేరుకొని దర్యాప్తు చేసి కేసు నమోదు చేశారు.

# సిసి రోడ్డు పనులు ప్రారంభించిన సర్పంచ్ మెండు రత్న మాల



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చి 31, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** రాజపేట మండలం బసంతాపురం గ్రామంలో జాతీయ ఉపాధి హామీ పథకం నిధులు 5 లక్షల రూపాయలతో సిసి రోడ్డు పనులను మంగళవారం సర్పంచ్ మెండు రత్నమాల సత్తిరెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గొల్లపల్లి రాజు గౌడ్, వార్డు సభ్యులు మెండు ఉపేందర్ రెడ్డి, గంధమల్ల కవిత, వడ్లకొండ రాములమ్మ, ములకలపల్లి రమేష్, వడ్లకొండ మాధవి, గ్రామస్తులు మెండు భాస్కర్ రెడ్డి, మెండు మధుసూదన్ రెడ్డి, మెండు మహేందర్ రెడ్డి, గంధమల్ల బాలకృష్ణ, గొల్లపల్లి స్వామి, వడ్లకొండ నరసయ్య, వడ్లకొండ రాజయ్య, వడ్లకొండ స్వామి, వడ్లకొండ మహేష్ బాబు, మెండు భగవాన్ రెడ్డి, నారెడ్డి చంద్రారెడ్డి, మెండు సాయికుమార్, వడ్లకొండ శివ, లు పాల్గొన్నారు. సీసీ రోడ్డు మంజూరు చేసిన ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యకు ఈ సందర్భంగా గ్రామస్తులు కృతజ్ఞతలు చెప్పారు.

# ఇంట్లో నగలు నగదు లేకుండా జాగ్రత్తపడాలి : ఎస్ఐ లింగారెడ్డి




**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చి 31, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** రాజపేట, ఇంటికి తాళం వేసి ఇతర ప్రాంతాలకు ప్రయాణం చేసేవారు తప్పకుండా ఇంట్లో నగలు నగదు విలువైన వస్తువులు లేకుండా జాగ్రత్త పడాలని రాజపేట ఎస్ఐ లింగారెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇంటికి తాళం వేసి వివిధ కారణాలవల్ల ప్రయాణం చేసే వ్యక్తులు తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. పరిసర నివాసితులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఎట్టి పరిస్థితులలో బంగారం వెండి నగదు తో పాటు అమూల్యమైనా విలువైన వస్తువులు ఇంట్లో ఉంచరాదన్నారు. అంటే వస్తువులకు భద్రత ఉండాలని తెలిపారు. దొంగతనాలు చేసే వ్యక్తులు తాళం వేసిన ఇంటిని టార్గెట్ గా చేస్తారని ఎస్ఐ చెప్పారు. తాళం వేసిన ఇంట్లో విలువైన వస్తువులకు భద్రత ఉండబోదని చోరీకి ఆస్కారం ఉంటుందని చెప్పారు. అపరిచితులు గ్రామాలలో సంచరించినా, అనుమానం ఉన్న వ్యక్తులు తారసపడినా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ కోరారు. భద్రత లేని ఇంట్లో నగదు బంగారం వెండి వస్తువులు ఉంచుకోరాదని సూచించారు.

# చేనేత, పవర్లూమ్ సహకార సంఘాల్లో సభ్యత్వం కల్పించాలి

రాజపేట పద్మశాలి సంఘం అధ్యక్షులు చిన్నం వెంకటరమణ



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చి 31, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** రాజపేట, చేనేత, పవర్లూమ్ సహకార సంఘాల ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం సిద్ధమవుతున్న సమయంలో, ఇదివరకు సంఘాలలో సభ్యత్వం లేని అర్హులైన చేనేత, పవర్లుమ్ కార్మికులకు సంఘాలలో కొత్తగా సభ్యత్వానికి అవకాశం ఇవ్వాలని, రాజపేట పద్మశాలి సంఘం అధ్యక్షులు చిన్నం వెంకటరమణ ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం విలేకర్లతో మాట్లాడుతూ... సంఘాలలో సభ్యత్వం లేని కార్మికులకు సహకార సంఘాల ద్వారా వచ్చే ప్రభుత్వ ప్రయోజనాలు, లాభాలు కానీ ఏమీ ఉండవని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎందుకంటే రాష్ట్రంలో 2013 నుంచి ఇప్పటివరకు సహకార సంఘాలకు ఎన్నికలు జరగలేదు. 13 సంవత్సరాలు గడిచింది కాబట్టి సంఘాలలో కొత్త సభ్యత్వం గురించి రాష్ట్ర వ్యాప్తంగా వేలాదిమంది చేనేత, పవర్లూమ్ కార్మికులు ఎదురుచూస్తున్నారని, ప్రభుత్వం ఇప్పటికైనా కార్మికులకు అన్యాయం జరగకుండా చూడాలని ఆయన కోరారు. కార్మికులకు సంఘాలలో సభ్యత్వం లేని వారికి సభ్యత్వం ఇచ్చిన తర్వాత ఎన్నికలకు పోవాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు.

# ఘనంగా శ్రీనివాస్ రెడ్డి పదవీ విరమణ అభినందన సభ


**ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ముప్పారపు శ్రీనివాస్ రెడ్డి**



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చి 31, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** రాజపేట మండలం నమిల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇన్చార్జ్ ప్రధానోపాధ్యాయులుగా, ఇంగ్లీష్ స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులుగా 14 సంవత్సరాల పాటు చక్కగా విధులు నిర్వర్తించిన జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ముప్పారపు శ్రీనివాస్ రెడ్డి ఉద్యోగ విరమణ అభినందన సభ మంగళవారం వట్టిపల్లి శ్రీనివాస్ గౌడ్ ఫంక్షన్ హాల్ లో ఘనంగా జరిగింది. శ్రీనివాస్ రెడ్డి మంచికి మారుపేరు అని ఉద్యోగరీత్యా, పిఆర్టియు అభివృద్ధికి చేసిన కృషిని పిఆర్టియు నాయకులు పలువురు అభినందించారు. విద్యార్థుల భవిష్యత్తుకు పునాదులు వేసి తీర్చిదిద్ది బావి భారత పౌరులుగా తయారు చేయడంలో తనదైన శైలిలో కృషి చేశారని పేర్కొన్నారు. విద్యార్థులకు మార్గదర్శిగా ఉంటూ వారి అభివృద్ధికి కృషి చేశారు. పి.ఆర్.టి.యు రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షులుగా కొనసాగుతూ భవిష్యత్తులో వారి సహాయ సహకారాలు ఈ సమాజానికి అవసరమని అన్నారు. ఈ కార్యక్రమంలో పిఆర్టియు జిల్లా అధ్యక్షులు అమరేందర్ రెడ్డి ప్రధాన కార్యదర్శి మధుసూదన్, గౌరవ అధ్యక్షులు వీరారెడ్డి మండల శాఖ అధ్యక్షులు సుబ్బరాజు, ప్రధాన కార్యదర్శి గౌటే బాలరాజు, కార్యదర్శి వంశీధర్, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల జిల్లా ప్రధాన కార్యదర్శి రవీందర్ నాయక్, ప్రభాకర్, తడక రాజు, శ్రీనివాస్ రెడ్డి, భారతి, బావిక, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డిని ఉపాధ్యాయులు ఉపాధ్యాయ సంఘాలు విద్యార్థులు పలువురు నాయకులు తల్లిదండ్రులు జర్నలిస్టులు పూలమాలలు జ్ఞాపికలు పుష్పగుచ్ఛము శాలువాలతో సత్కరించారు

# బీటీ రోడ్డు పూర్తి చేయండి లేదా కంకరనైనా తొలగించండి

మల్లగూడెం గ్రామస్తుల వేడుకలు



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చి 31, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** రాజపేట మండలం మల్లగూడెం గ్రామ ప్రజల సంతోషం 15 రోజులు మాత్రమే ఉండగా అంతకంటే ఎక్కువ కష్టాలు అనుభవిస్తున్నారు. పాముకుంట కాషగూడెం నుండి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న మల్లగూడెం గ్రామానికి గుంతల మట్టి రోడ్డు మాత్రమే ఉండడంతో గ్రామస్తుల నాయకుల కోరిక మేరకు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత, ప్రస్తుత ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యలు బీటీ రోడ్డు కి నిధులు మంజూరు చేశారు. అట్టి నిధులతో ఇటీవల ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య ఆదేశాల మేరకు బీటీ రోడ్డు పనులు ప్రారంభమయ్యాయి. కిలోమీటర్ మేరా కంకర పరచి 15 రోజులు పని చేసి చేతులు దులిపారు. దీంతో గ్రామం నుండి ఇతర గ్రామాలకు వెళ్లాలన్న ఇతర గ్రామాల నుండి మల్లగూడెం పోవాలన్న ప్రయాణికులకు ప్రజలకు నరకం కనిపిస్తుంది. విద్యార్థులు వ్యాపారులు యువకులు, మహిళలు ఉద్యోగులు నిత్యం అరగోస పడుతున్నారు. గ్రామానికి వచ్చే బస్సులు కూడా రద్దయ్యాయి. ఇట్టి పరిస్థితిని సంబంధిత అధికారులకు కాంట్రాక్టర్లకు చెప్పినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. పరచిన కంకర ను తొలగించాలని లేకపోతే బీటీ రోడ్డు పనులను ప్రారంభించాలని ప్రజలందరూ అసహనం వ్యక్తం చేస్తున్నారు.

# దేశానికి మరోసారి కోవిడ్ ముప్పు..? టెన్షన్ పెట్టిస్తున్న కొత్త వేరియంట్ 'సికాడా'



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చ్ 31, హెల్త్ డెస్క్:** ప్రపంచవ్యాప్తంగా కరోనా వైరస్ మరోసారి రూపాంతరం చెందుతూ కొత్త రూపంలో విరుచుకుపడుతోంది. తాజాగా 'సికాడా' అనే పేరుతో పిలవబడే బిఎ.3.2 అనే కొత్త ఒమిక్రాన్ సబ్ వేరియంట్ వెలుగులోకి వచ్చింది. ఇది ఇప్పటికే 23కి పైగా దేశాలకు పాకినట్లు అంతర్జాతీయ ఆరోగ్య సంస్థలు ధృవీకరించాయి.

దక్షిణ ఆఫ్రికాలో గుర్తింపు..

ఈ వేరియంట్‌ను మొదటగా 2024 నవంబర్‌లో దక్షిణ ఆఫ్రికాలో గుర్తించారు. అయితే, 2025 సెప్టెంబర్ నుండి దీని వ్యాప్తి వేగవంతమైంది. ప్రస్తుతం అమెరికాలోని 25 రాష్ట్రాల్లోని మురుగునీటి నమూనాల్లో ఈ వైరస్ ఆనవాళ్లు కనిపించడంతో ఆరోగ్య శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు.

బాడీలో కనిపించే లక్షణాలివే..

గత వేరియంట్లతో పోలిస్తే 'సికాడా' వేరియంట్ లక్షణాలు కొంచెం భిన్నంగా ఉన్నాయి. ఈ వేరియంట్ సోకిన వారిలో గొంతు మంట, నొప్పి ప్రధానంగా కనిపిస్తోంది. ముక్కు బ్లాక్ అవ్వడం లేదా నీరు కారడం ఉంటుంది. అదేవిధంగా విపరీతమైన నీరసం, ఒళ్లు నొప్పులు, తలనొప్పి, చలితో కూడిన జ్వరం, పొడి దగ్గు ఉంటుందని వైద్యులు తెలిపారు. కొన్ని కేసుల్లో ఈ వేరియెంట్ సోకిన వారికి రుచి, వాసన కోల్పోయే అవకాశం కూడా ఉంది.

కొనసాగుతున్న పరిశోధనలు..

ప్రస్తుతానికి ఈ వేరియంట్‌ను 'వేరియంట్ అండర్ మానిటరింగ్' కేటగిరీలో పెట్టారు. అంటే దీనిపై ఇంకా పరిశోధనలు జరుగుతున్నాయి. ఇది వేగంగా వ్యాప్తి చెందే గుణం కలిగి ఉన్నప్పటికీ, దీని వల్ల వచ్చే అనారోగ్యం స్వల్పంగా లేదా మధ్యస్థంగానే ఉంటోందని నిపుణులు చెబుతున్నారు. అయితే, వృద్ధులు, గర్భిణీలు, ఇతర ఆరోగ్య సమస్యలు ఉన్నవారు జాగ్రత్తగా ఉండాలని వైద్యులు హెచ్చరిస్తున్నారు. 'సికాడా' వేరియంట్ మునుపటి వేరియంట్ల కంటే భిన్నంగా ఉండటం వల్ల, ఇది టీకాలు తీసుకున్న వారిలో కూడా మళ్లీ వచ్చే అవకాశం ఉంది. కాబట్టి రద్దీగా ఉండే ప్రదేశాల్లో మాస్కులు ధరించడం, శుభ్రత పాటించడం ఉత్తమ అని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. ప్రస్తుతానికి భయపడాల్సిన అవసరం లేదని, కానీ అప్రమత్తత అవసరమని ప్రభుత్వం పేర్కొంది.



# నవ్వుతూ బతకాలిరా..!



పుట్టుకతోనే దవడలు, దంతాలు, చిగుళ్లలో లోపాలుండవచ్చు. వీటి నిర్మాణంలో అవకతకలు, వ్యత్యాసాలు ఉండొచ్చు. ఫలితంగా చిరునవ్వు నవ్వలేని పరిస్థితి ఉండొచ్చు. ఈ పరిస్థితి ఆత్మవిశ్వాసాన్ని కూడా దెబ్బతీస్తుంది. కాబట్టి ఈ లోపాలతో సర్దుకుపోకుండా తాజాగా అందుబాటులోకొచ్చిన స్మైల్ కరెక్షన్ చికిత్సలతో వాటిని సరిదిద్దుకునే ప్రయత్నం చేయాలి. సాధారణంగా చిరునవ్వుకు అడ్డుపడే లోపాలు ఏవంటే....

**దవడలు:** పై దవడ లేదా కింది దవడ ముందుకు లేదా వెనక్కి జరిగి ఉండొచ్చు. దవడలు పెద్దగా లేదా చిన్నగా ఉండొచ్చు

**దంతాలు:** చిన్న లేదా పెద్ద దంతాలు, దంతాలు ముందుకు లేదా వెనక్కి జరిగి ఉండడం, ముదురు రంగుల్లో ఉండడం, దంతాలు ముఖాకృతికి తగిన ఆకారంలో లేకపోవడం, దంతాల మధ్య ఖాళీలు

**చిగుళ్లు:** ముదురు రంగులో ఉండడం, పెద్దవిగా లేదా చిన్నవిగా ఉండడం డిజిటల్ స్మైల్ డిజైన్‌తో... అత్యధిక రిజల్యూషన్ కలిగిన ఇమేజింగ్, సాఫ్ట్‌వేర్స్ సహాయంతో ఫొటో తీసి, ఏ మార్పులు చేస్తే ఆకర్షణీయమైన చిరునవ్వును సాధించవచ్చో అంచనా వేసి, తదనుగుణమైన చికిత్సా పద్ధతులను ఎంచుకోవచ్చు. ఈ చికిత్సల్లో ప్రోస్థోడాంటి?స్టతో పాటు అలైనర్స్ స్పెషలిస్ట్, మాక్సిలోఫేసియల్ సర్జన్ల ప్రమేయం ఉంటుంది. అందరూ కలిసి ఆకట్టుకునే చిరునవ్వుకు అవసరమైన చికిత్సలను అంచనా వేస్తారు. గతంతో పోల్చితే నేడు అందుబాటులో ఉన్న దంత చికిత్సలన్నీ తక్కువ సమయంలో సహజసిద్ధ ఫలితాన్ని రాబట్టగలిగేవే! వీటిలో పొరపాట్లకూ, అసౌకర్యాలకూ ఏమాత్రం తావుండదు. మరీ ముఖ్యంగా సెక్స్, వయసు, ముఖాకృతుల ఆధారంగా సాధ్యమైనంత సహజసిద్ధమైన, ఆకర్షణీయమైన చిరునవ్వు లక్ష్యంగా చికిత్స సాగుతుంది.

**దంతాల చికిత్సలివే!**

**అలైనర్స్:** దంతాల రంగులో కలిసిపోయే క్లియర్ అలైనర్స్ ఇప్పుడు అందుబాటులో ఉన్నాయి. వీటి సహాయంతో ఎదగుదిగుడు దంతాలను క్రమంలోకి తీసుకురావచ్చు.

**వినీర్స్:** దంతాల రంగు, పరిమాణాలను తగ్గించే చికిత్స ఇది. దంతాలను కొంత మేరకు తగ్గించి, వాటి పైన లామినేటింగ్ చేయడం వల్ల దంతాలు ఆకర్షణీయమైన రూపాన్ని సంతరించుకుంటాయి

**టీత్ వైటెనింగ్:** దంతాలను మెరుగైన రంగులోకి మార్చుకోవచ్చు

**లేజర్ చికిత్స:** చిగుళ్ల రంగును లేజర్ చికిత్సలో సరిదిద్ది గులాబీ రంగులోకి మార్చుకోవచ్చు. తేలికపాటి సర్జరీతో చిగుళ్ల పరిమాణాలను సరిదిద్దుకోవచ్చు

**జా కరెక్షన్:** సర్జరీతో దవడ ఎముకల ఆకారాన్నీ, నిర్మాణాన్నీ సరిదిద్దే చికిత్స ఇది

**కృత్రిమ మేధస్సు సహాయంతో...**

డిజిటల్ స్మైల్ డిజైన్‌కు కృత్రిమ మేధస్సును జోడించి అడిటివ్ త్రీడి ప్రింటింగ్, క్యాట్ క్యామ్ బిల్డింగ్ సహాయంతో, తాత్కాలిక దంతాల నమూనాలు, అంతిమ వినీర్స్, అలైనర్స్ (క్రౌన్స్, క్యాప్స్ డిజైన్ చేసుకోవచ్చు. ఇంట్రా ఓరల్ స్కాన్స్ అందుబాటులోకొచ్చిన తర్వాత నోట్లో కాస్ట్‌లను ఉంచి నమూనాలను సేకరించే ఇబ్బంది తప్పిపోయింది. కాస్ట్‌లను నోట్లో ఉంచడంతో అసౌకర్యం కలగడంతో పాటు వికారానికి లోనయ్యే ఇబ్బంది ఉంటూ ఉండేది. అంతే కాకుండా ఈ నమూనాలతో తయారుచేసిన కట్టుడు పళ్ల కచ్చితత్వంలో సమస్యలు తలెత్తుతూ ఉండేవి. కానీ ఇంట్రా ఓరల్ స్కాన్స్‌లో డిజిటల్ ఇంప్రెషన్ టెక్నిక్స్‌ను అనుసరిస్తారు కాబట్టి ఎలాంటి అసౌకర్యానికీ, పొరపాట్లకూ తావు లేకుండా కచ్చితత్వంతో కూడిన నమూనాలను ఎంతో తక్కువ సమయంలో రూపొందించుకునే వెసులుబాటు ఉంటుంది.

**కోలుకునే సమయం...**

చికిత్స నుంచి కోలుకునే సమయం లోపం తీవ్రత మీద ఆధారపడి ఉంటుంది. వినీర్స్ అమర్చుకునే ప్రక్రియ ఉదయం నుంచి సాయంత్రంలోగా లేదా ఒకటి నుంచి రెండు రోజుల్లో పూర్తయిపోవచ్చు. స్మైల్ కరెక్షన్ చికిత్సల్లో, దవడలను సరిదిద్దే సందర్భాల్లో మినహా మరెక్కడా సర్జరీల ప్రమేయం ఉండదు. ఈ సర్జరీలతో పాటు గమ్ లేజర్ చికిత్సలు ముగిసి, అంతిమ ఫలితాన్ని సాధించడానికి రెండు నెలల సమయం పట్టొచ్చు. దంతాల హెచ్చుతగ్గులను కూడా సరిదిద్దవలసివస్తే.. జా కరెక్షన్, టూత్ అలైన్‌మెంట్, గమ్ కరెక్షన్ మొత్తం మూడు చికిత్సలకూ కలిపి ఆరు నుంచి ఎనిమిది నెలల సమయం పట్టొచ్చు.

# రాశిఫలాలు




**మేషం :** మేష రాశి వారికి ఈ రోజు అనుకూలంగా ఉంటుంది. దైవానుగ్రహంతో కార్యసిద్ధి చేకూరుతుంది. ప్రారంభించిన పనులన్నీ సకాలంలో పూర్తవుతాయి. ఉద్యోగంలో మీ సమర్ధతను అధికారులు గుర్తించి ప్రోత్సహిస్తారు. వ్యాపారులు నూతన పథకాలతో ఆశించిన లాభాలు అందుకుంటారు. ఆర్థిక పరిస్థితి ఆశాజనకంగా ఉంటుంది. కుటుంబ సౌఖ్యం ఉంటుంది. ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం. శివారాధన శ్రేయస్కరం.

**వృషభం:** వృషభ రాశి వారికి ఈ రోజు ఫలవంతంగా ఉంటుంది. ప్రారంభించిన పనుల్లో మీ కృషి, ప్రయత్నాలు ఫలిస్తాయి. ఉద్యోగంలో గౌరవ మర్యాదలు పెరుగుతాయి. వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. మిత్రుల సహకారంతో ముఖ్యమైన పనులు పూర్తి చేస్తారు. ఆర్థిక విషయాల్లో అప్రమత్తత అవసరం. కుటుంబంలో సుఖ సంతోషాలు నెలకొంటాయి. ఆరోగ్యం సహకరిస్తుంది. శ్రీలక్ష్మి ధ్యానం శుభకరం.

**మిథునం :** మిథున రాశి వారికి ఈ రోజు అనుకూలంగా ఉంటుంది. వృత్తి ఉద్యోగాల్లో వేగవంతమైన పురోగతి ఉంటుంది. గతంలో నిలిచిపోయిన ప్రాజెక్టులు ఇప్పుడు జోరందుకుంటాయి. ఆర్థికంగా బలోపేతం అవుతారు. పెట్టుబడులు పెట్టడానికి అనువైన సమయం. కుటుంబంలో శుభకార్యాలు జరుగుతాయి. విష్ణు సహస్రనామ పారాయణ శాంతినిస్తుంది.

**కర్కాటకం :** కర్కాటక రాశి వారికి ఈ రోజు మిశ్రమ ఫలితాలు ఉంటాయి. ఉద్యోగంలో ఏకాగ్రతతో బాధ్యతలు నిర్వహించాలి. ఇతరుల విషయాల్లో జోక్యం చేసుకోవద్దు. వివాదాలకు దూరంగా ఉంటే మంచిది. ఆవేశానికి లోను కాకుండా సహనంతో మెలిగితే ప్రయోజనం ఉంటుంది. ఆర్థిక వ్యవహారాల్లో కుటుంబ సభ్యుల సలహాలు పాటించడం మంచిది. అనారోగ్య సమస్యలు ఇబ్బంది పెడతాయి. నవగ్రహ దర్శనంతో ప్రతికూలతలు తొలగుతాయి.

**సింహం:** సింహ రాశి వారికి ఈ రోజు శుభప్రదంగా ఉంటుంది. శ్రేష్టమైన శుభ సమయం నడుస్తోంది. మీ ఆశయాలు, లక్ష్యాలు నెరవేరుతాయి. ఆరంభించిన పనుల్లో ఆటంకాలు తొలగుతాయి. ఉద్యోగంలో గుర్తింపు లభిస్తుంది. వ్యాపారంలో సకాలంలో తీసుకునే నిర్ణయాలతో లాభాలు పెరుగుతాయి. కీలక వ్యవహారాల్లో అనుభవజ్ఞుల సలహాలు పాటించడం మంచిది. గృహంలో శాంతియుతమైన వాతావరణం ఉంటుంది. తీర్థయాత్రలతో ప్రశాంతత పొందుతారు. శ్రీ సుబ్రహ్మణ్య స్వామి దర్శనం శుభకరం.

**కన్య :** కన్య రాశి వారికి ఈ రోజు మిశ్రమ ఫలితాలు ఉంటాయి. ఉద్యోగ వ్యాపారాల్లో కొన్ని ఆటంకాలున్నప్పటికీ స్థిరమైన పురోగతి సాధిస్తారు. ఉద్యోగంలో గౌరవంతో పాటు పదోన్నతులు కూడా అందుకుంటారు. వ్యాపారంలో పెట్టుబడులు లాభిస్తాయి. మీ వాక్చాతుర్యంతో కుటుంబ సమస్యలు, వివాదాలకు ముగింపు పలుకుతారు. అనవసర ఖర్చులు పెరగకుండా చూసుకోండి. అనారోగ్య సమస్యలు ఇబ్బంది పెడతాయి. ఆదిత్య హృదయం పారాయణ మేలు చేస్తుంది.

**తుల :** తులా రాశి వారికి ఈ రోజు ఫలవంతమైనదిగా ఉంటుంది. వివిధ రంగాల్లో మీరు సాధించిన విజయాలు, ఆదాయంలో వృద్ధి మిమ్మల్ని సంతోషంగా, సంతృప్తిగా ఉంచుతాయి. ప్రారంభించిన పనుల్లో విజయావకాశాలు మెరుగవుతాయి. వ్యాపారంలో సమయస్ఫూర్తితో వ్యవహరించి అధిక లాభాలు ఆర్జిస్తారు. కుటుంబంలో ఆనందకరమైన వాతావరణం ఉంటుంది. ఆరోగ్యం సహకరిస్తుంది. శ్రీ వేంకటేశ్వరస్వామి దర్శనం శుభకరం.

**వృశ్చికం :** వృశ్చిక రాశి వారికి ఈ రోజు అనుకూలంగా ఉంటుంది. ఉద్యోగంలో పనిఒత్తిడి తగ్గుతుంది. మీ పనితీరు పట్ల ఉన్నతాధికారులు సంతృప్తి వ్యక్తం చేస్తారు. సామాజిక గుర్తింపు, పదోన్నతికి కూడా అవకాశం ఉంది! ఆర్థిక వ్యవహారాల్లో అప్రమత్తంగా ఉండాలి. కుటుంబంలో శుభకార్యాలు జరిగే సూచన ఉంది. ఒక శుభవార్త మీ ఆనందాన్ని రెట్టింపు చేస్తుంది. ఆరోగ్యం సహకరిస్తుంది. హనుమాన్ చాలీసా పారాయణ శుభకరం.

**ధనుస్సు:** ధనుస్సు రాశి వారికి ఈ రోజు సామాన్యంగా ఉంటుంది. ఉద్యోగ వ్యాపారాల్లో సమస్యలు చికాకు పెడతాయి. ఎంత కష్టపడినా సరైన ప్రతిఫలం లభించక నిరాశ చెందుతారు. ఊహించని ఖర్చులతో ఆర్థిక పరిస్థితి క్షీణిస్తుంది. కుటుంబ కలహాలు అశాంతికి కారణమవుతాయి. ఓర్పు, సహనంతో ప్రయత్నిస్తే సమస్యలు ఓ కొలిక్కి వస్తాయి. వివాదాస్పద అంశాలకు దూరంగా ఉంటే మంచిది. అనారోగ్య సమస్యలు చికాకు పెడతాయి. సూర్య ఆరాధన మనోధైర్యాన్నిస్తుంది.

**మకరం :** మకర రాశి వారికి ఈ రోజు శుభప్రదంగా ఉంటుంది. వ్యాపార రంగంలోని వారికి ఈ రోజు విశేషమైన లాభాలు ఉంటాయి. వృత్తి ఉద్యోగాల్లో మీ మాటకు విలువ పెరుగుతుంది. నూతన అవకాశాలు లభిస్తాయి. ఆర్థికాభివృద్ధి ప్రయత్నాలు ఫలిస్తాయి. కుటుంబంతో ఆనందంగా గడుపుతారు. జీవిత భాగస్వామితో విహారయాత్రలకు వెళ్తారు. ఆరోగ్యం బాగుంటుంది. ఇష్ట దేవతారాధన శుభకరం.

**కుంభం :** కుంభ రాశి వారికి ఈ రోజు ఫలవంతంగా ఉంటుంది. అన్ని రంగాల వారికి తమ తమ రంగాల్లో కృషికి తగిన ఫలితాలు ఉంటాయి. ఆర్థికంగా లాభదాయమైన సమయం. వ్యాపార విస్తరణ ప్రయత్నాలు విజవంతం అవుతాయి. కుటుంబ సభ్యుల సహకారంతో ముఖ్యమైన పనుల్లో విజయం సాధిస్తారు. నూతన వస్త్రాభరణాలు కొనుగోలు చేస్తారు. కుటుంబంలో ఉత్సాహభరితమైన వాతావరణం ఉంటుంది. శ్రీలక్ష్మి గణపతి ఆలయ సందర్శనం శుభకరం.

**మీనం :** మీన రాశి వారికి ఈ రోజు మిశ్రమ ఫలితాలు ఉంటాయి. ఉద్యోగ వ్యాపారాల్లో ఉన్నత స్థానంలో నిలవాలనుకుంటే అవిశ్రాంత కృషి అవసరం. బాధ్యతాయుతంగా వ్యవహరించడం వలన ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. ఆదాయాన్ని మించిన ఖర్చులు ఉంటాయి. ఆధ్యాత్మిక ధార్మిక కార్యక్రమాల్లో పాల్గొంటారు. కుటుంబంలో కలహాలు రాకుండా జాగ్రత్త వహించండి. అనారోగ్య సమస్యలు అశ్రద్ధ చేయవద్దు. కార్యసిద్ధి హనుమ ఆరాధన మేలు చేస్తుంది.

# భారత్ కు గుడ్ న్యూస్ చెప్పిన పాకిస్థాన్.!

హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చ్ 31 :
గతేడాది ఏప్రిల్ 22న జమ్మూకాశ్మీర్ లోని పహల్గామ్ లో పాకిస్థాన్ ముష్కరులు జరిపిన మారణహోమంలో 26 మంది అమాయక టూరిస్టులు ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. దాంతో పాకిస్థాన్ పై భారత్ మే 7–10 మధ్య ఆపరేషన్ సింధూర్ చేపట్టింది. ఉగ్ర స్థావరాలను ధ్వంసం చేసింది. వందలాది ఉగ్ర మూకలను హతమార్చింది. ఈ నేపథ్యంలో భారత్– పాకిస్థాన్ మధ్య సంబంధాలు క్షీణించాయి. అయితే తాజాగా ఇరు దేశాల మధ్య కీలక పరిణామం చోటుచేసుకుంది.భారత్ నుంచి ఏప్రిల్ లో దాదాపు 3000 మంది సిక్కు యాత్రికులు పాకిస్థాన్ వెళ్లేందుకు సిద్ధం అవుతున్నారు. పాకిస్థాన్ లోని పంజాబ్ ప్రావిన్స్ లో ఏప్రిల్ 10న మొదలయ్యే బైశాఖి ఉత్సవాల్లో వీళ్లంతా పాల్గొననున్నారు. దీంతో పాటు లాహోర్, కర్తార్ పూర్, ఎమినాబాద్, ఫరూఖా బాద్, నంకానా సాహిబ్ వంటి సిక్కుల పుణ్యక్షేత్రాలను సందర్శించనున్నట్లు పాక్ అధికారులు తెలిపారు. ద్వైపాక్షిక ఒప్పందంలో భాగంగా పాక్ ఏటా వీరి కోసం ప్రత్యేక 'జథా' వీసాలు అందిస్తోంది.ఏప్రిల్ 10 నుంచి ప్రారంభం కానున్న బైశాఖి ఉత్సవాల్లో భాగంగా భారత్ నుంచి దాదాపు 3 వేల మంది సిక్కులు పాకిస్థాన్ కు బయల్దేరుతారు. ఏప్రిల్ 14న పంజాబ్ ప్రావిన్స్ లోని హసన్ అబ్దాల్ ప్రాంతంలోని గురుద్వారా పంజా సాహిబ్ లో బైశాఖి పౌర్ణమి కార్యక్రమం జరగనుంది. ఈ బైశాఖి పండుగను వైశాఖ నెల ప్రారంభంలో తొలి రోజున నిర్వహిస్తారు. దీనిని హార్వెస్ట్ సీజన్ కు తొలి అడుగుగా భావిస్తారు. ప్రతి ఏటా గురుద్వారా పంజా సాహిబ్ ను రంగులతో అలంకరిస్తారు. భక్తులు పసుపు పచ్చని టర్బన్ లు ధరించి ఇక్కడికి చేరుకుంటారు.బైశాఖి పూర్ణిమ, ఖల్సా జన్మదిన్ సంబరాల్లో భాగంగా పంజాబ్ ప్రావిన్స్ రిలీజియస్ ఎఫైర్స్ మినిస్టర్ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. ఈ మేరకు లాహోర్ లోని పంజాబ్ హోమ్ డిపార్ట్ మెంట్ హై- లెవల్ అడ్మినిస్ట్రేటివ్ మీటింగ్ నిర్వహించింది. ఈ సమావేశానికి ప్రావిన్షియల్ మినిస్టర్ ఖవాజా సల్మాన్ రఫిఖీ, ప్రావిన్షియల్ మినిస్టర్ అండ్ పర్దాన్ ఆఫ్ పాకిస్థాన్ సిక్కు గురుద్వారా పర్బంధఖ్ కమిటీ సర్దార్ రమేశ్ సింగ్ అరోరా హాజరయ్యారు. ఈ సమావేశంలో ఏప్రిల్ 10 న భారత్ నుంచి పాకిస్థాన్ కు 3 వేల మంది సిక్కు భక్తులు వస్తారని అంచనాకు వచ్చారు. భక్తులు నానక్ రామ్ సాహిబ్, ఫరూఖాబాద్, షేక్ పుర్, ఖర్తార్ పూర్, ఎమినాబాద్, లాహోర్ లోని మతపరమైన ప్రదేశాల్లోనూ పర్యటించనున్నట్లు సమాచారం.



Edited, Published and Owned by Konadoddi Naveen Kumar and Printed at Srinith Publications Falcon Printing Press #1-2-201, Shop No.02, Khan Street Zaheerabad 502220.T.G. And Published from #1-2-201, Shop No.02, Khan Street Zaheerabad 502220.T.G. Editor's Konadoddi Naveen Kumar, Dr.Tadhkal Rahul Kumar Reg. No.TEL-TEL/2023/12249. Email.HyderabadPulse23@gmail.com, Web:www.HyderabadPulse.com, Cell: +91-94406 53413, +91-9989834020.